RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
LGTV
# లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంరెడ్డి
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,249 | పేజీలు -12 | ఆదివారం - 04 - అక్టోంబర్ - 2026 | వెల రూ.2/-

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..

### బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం



అమరావతి : నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. మిగతా..2లో

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు: మంత్రి కోమటిరెడ్డి హామీ

### ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి

### యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు మిగతా..2లో

## పాఠశాలల్లో అల్పాహార పథకం..
## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు




- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు.

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై

# సీఎం రేవంత్ ఆదేశాలివే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు ఈరోజు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు.
- సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది.




హైదరాబాద్, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. (శుక్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు. మిగతా..2లో

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి విక్రమార్క




- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

## విదేశీ అప్పులపైనే పాక్ బతుకు..
## ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!




- విదేశీ రుణాలు, డిపాజిట్లపైనే ఆధారపడుతున్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ
- ఎగుమతులపై దృష్టి పెట్టకపోవడమే సంక్షోభాలకు అసలు కారణమని విశ్లేషణ
- చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ కూడా ఎగుమతులను పెంచడంలో విఫలం
- అప్పులు, డిపాజిట్లు తాత్కాలిక ఉపశమనమేనని నిపుణుల హెచ్చరిక
- ఎగుమతులు పెరగకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..
## 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

- ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం
- 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్




ఢిల్లీ : భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత మిగతా..2లో

## కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు

- అక్టోబర్ 4- 6 మధ్య భారీ వర్షాలకు అవకాశం- తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకలోనూ వానలు
- ఏపీ, రాయలసీమలో బలమైన ఈదురుగాలుల హెచ్చరిక




హైదరాబాద్: : వర్షాకాలంలో కూడా సమ్మర్ లా ఎండలు మండుతుండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది! నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతంలో కొనసాగుతున్నా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. కేరళ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో అక్టోబర్ 7 వరకు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.

### తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## నాటి యువగళం హామీ.. నేడు
## గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!




- 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- రాయలసీమలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- మదనపల్లె వేదికగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన సర్కార్
- 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయి చేయూత
- ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం

## రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా

# చేసి చూపిస్తున్నా

- అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది.
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి కృతజ్ఞతలు.
- **2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుంది**

అమరావతి : గాంధీ జయంతి సందర్భంగా కరవుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. అక్షరాలా రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాయలసీమ కరవు పరిస్థితులు, రైతుల కష్టాలను నిర్మలా సీతారామన్‌కు పలు సందర్భాల్లో వివరించానని రైతుల బాధలను నిర్మలా సీతారామన్ అర్థం చేసుకున్నారని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 'రాయలసీమ ఉద్యాన హబ్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అలానే అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చిందని ఏ ప్రాజెక్టునైనా జయప్రదం చేసేవరకు వదిలిపెట్టని వ్యక్తి అనంత్ అంబానీ అని ప్రశంసించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. సాగునీరు ఇస్తే బంగారం



పండిస్తారు: రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పానని అలానే చేసి చూపిస్తున్నానని సీఎం అన్నారు. తాను, పవన్, మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. మోదీ నమ్మకాన్ని నిజం చేస్తూ నిర్మలాసీతారామన్ మిగతా..2లో

## రాయలసీమ రైతుల తల రాతలు
# మారబోతున్నాయి




- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంరెడ్డి
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com



## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

అమరావతి : రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్: గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం.. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్

చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు: మంత్రి కోమటిరెడ్డి హామీ

పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..

సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల



ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 - సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా - చేసి చూపిస్తున్నా

మొదటి పేజి తరువాయి

ముందుకు సాగుతున్నారని కొనియాడారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కుకు నిధులిచ్చి ఆదుకున్నారని తెలిపారు. సీమ దశ, దిశ మార్చి గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు తీసుకొచ్చామని, కరవు నేలను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. పండ్ల తోటల సాగులో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందని సాగునీరు ఇస్తే సీమ ప్రజలు బంగారం పండిస్తారని సీఎం కొనియాడారు. "ఎన్టీఆర్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకెళ్తున్నాం. హంద్రీనీవా ద్వారా నీళ్లు లేకపోతే మదనపల్లె మొత్తం వలసపోయేది. సీమ పరిస్థితులు మార్చేందుకు డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. పంటకుంటలు, వాటర్‌షెడ్ పథకాలు ఏర్పాటు చేసి జలసంరక్షణకు ప్రాధాన్యమిచ్చాం. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తిచేసి మూడేళ్లలో జాతికి అంకితం చేసే బాధ్యత మాది. సీమలో హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచి కెనాల్ విస్తరణ పూర్తికి చర్యలు తీసుకుంటాం. రాయలసీమను కరవు సీమ కాదని మరోసారి నిరూపిస్తా."- చంద్రబాబు, ముఖ్యమంత్రి 20 రకాల పంటల్లో ఏ పంట అయినా పండించే సత్తా సీమ రైతులదని ఉత్పత్తికి మార్కెట్ సౌకర్యమిస్తే సంపద సృష్టిస్తారని సీఎం చెప్పారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో పంటలు, ధరలు, వాతావరణ స్థిరీకరణ జరుగుతుంది వెల్లడించారు. అనంత్ అంబానీ పారిశ్రామికవేత్త మాత్రమే కాదు పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో జంతువుల పునరావాస కేంద్రాన్ని అనంత్ అంబానీ ఏర్పాటు చేశారని అలానే తిరుమల శ్రీవారిపై భక్తితో అనంత్ అంబానీ ఉచితంగా ఎలక్ట్రికల్ బస్సులు ఇచ్చారని వెల్లడించారు. పోలవరం పనులు ముమ్మరంగా సాగుతున్నాయమని ప్రాజెక్టును పూర్తిచేసి మోదీ చేతులమీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా ం!

మొదటి పేజి తరువాయి

అమరావతి: 'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### రూ. లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు.

పాదయాత్రలో చూసి.. మిషన్ రాయలసీమగా మార్చి..

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు.

### కరవు సీమ నుంచి ఫలాల సీమగా..



ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై సీఎం రేవంత్ ఆదేశాలివే

మొదటి పేజి తరువాయి

అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి




యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం అన్నారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇదని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలని వెల్లడించారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని ఆదేశించారు. సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ పాల్గొన్నారు.

## కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు

మొదటి పేజి తరువాయి

కోస్తాంధ్ర, రాయలసీమలో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి అక్టోబర్ 5 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాల విషయంలో మార్పులు కనిపించొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

### తమిళనాడులో గాలుల వేగం

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న కేరళ, లక్షద్వీప్, తమిళనాడు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తమిళనాడుతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలోనూ వాతావరణం మారే అవకాశం ఉంది. వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

### కర్ణాటకలోనూ వానలు

కోస్తా కర్ణాటకలో అక్టోబర్ 2న విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో అక్టోబర్ 5న అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో బెంగళూరు సహా దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం మారొచ్చు. మహారాష్ట్రలోని కోంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ అక్టోబర్ 7 వరకు అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది.

### ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాలు

దక్షిణాదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాల పరిస్థితి కొనసాగనుంది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని ఐఎండీ తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని చోట్ల భారీ వర్షం పడే అవకాశం ఉంది. ఒడిశా, బంగాల్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవుల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడొచ్చు. బిహార్, జార్ఖండ్‌లో అక్టోబర్ 5 నుంచి 7 మధ్య అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు



పడే అవకాశం ఉంది.

### ఉత్తరాదిలో రుతుపవనాల వెనక్కి ప్రయాణం

అదే సమయంలో ఉత్తర భారతంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు త్వరలో వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ రుతుపవనాల ప్రభావం తగ్గుతోంది. అలా ఉత్తర భారతంలో వానలు తగ్గి వాతావరణం పొడిగా మారుతున్నా, దక్షిణ భారతంలో మాత్రం అక్టోబర్ మొదటి వారం వరకు వర్షాల ప్రభావం కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులను గమనించాల్సి ఉంటుంది.

## విదేశీ అప్పులపైనే పాక్ బతుకు.. ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి అందే రుణాలు, సౌదీ అరేబియా, చైనా వంటి మిత్ర దేశాలు ఇచ్చే డిపాజిట్లపైనే దేశం పూర్తిగా ఆధారపడి ఉంది. ఈ నిధులు ఎప్పటికప్పుడు తలెత్తుతున్న చెల్లింపుల సంక్షోభం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) నుంచి తాత్కాలికంగా గట్టెక్కిస్తున్నప్పటికీ, దేశానికి దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ఓ నివేదిక స్పష్టం చేసింది. 'డాన్' పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం.. పాకిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తమ భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యతను అడ్డుపెట్టుకుని విదేశీ మద్దతు పొందడంపైనే దృష్టి సారించింది తప్ప, ఎగుమతి ఆధారిత సుస్థిర వృద్ధి నమూనాను నిర్మించలేకపోయింది. దీని ఫలితంగా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగినప్పుడల్లా అది దిగుమతులు, వినియోగం ఆధారంగానే జరిగింది. దీంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు తరచూ అడుగంటిపోవడం, సంక్షోభం తలెత్తడం ఒక చక్రంలా కొనసాగుతోంది. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అప్పటి సైనిక పాలకుడి హయాంలో పాకిస్థాన్‌కు భారీగా విదేశీ నిధులు, రుణమాఫీ, పెట్టుబడులు వెల్లువెత్తాయి. అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఆ నిధులన్నీ దిగుమతులు, వినియోగం, రియల్ ఎస్టేట్ రంగాలకు మళ్లడంతో 2008 నాటికి దేశం రికార్డు స్థాయిలో కరెంట్ ఖాతా లోటును ఎదుర్కొని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ముఖ్యంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) దేశంలో విద్యుత్ కొరతను తీర్చడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి దోహదపడింది. కానీ, విదేశీ రుణాలు తగ్గించుకోవడానికి అవసరమైన ఎగుమతుల వృద్ధిని మాత్రం సాధించలేకపోయింది. పైగా సీపీఈసీ ప్రాజెక్టుల కారణంగా దిగుమతులు మరింత పెరిగి 2018 నాటికి కరెంట్ ఖాతా లోటు మళ్లీ




ఆందోళనకర స్థాయికి చేరింది. కరోనా మహమ్మారి తర్వాత తీసుకున్న ఉద్దీపన చర్యలు, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కమోడిటీ ధరలు, రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ప్రస్తుతం దేశ విదేశీ మారక నిల్వలు పూర్తిగా ఐఎంఎఫ్ కార్యక్రమాలు, మిత్ర దేశాల డిపాజిట్లపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే, ఈ నిధులు దేశంలో ఆర్థిక కార్యకలాపాలను నేరుగా సృష్టించవని, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని తీసుకురావని నివేదిక హెచ్చరించింది. మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ నిధుల లభ్యత కూడా ఎప్పుడూ ప్రమాదంలోనే ఉంటుంది. గతంలో అభివృద్ధి ఆధారిత సహాయం, పెట్టుబడులు పొందిన పాకిస్థాన్, ఇప్పుడు అధిక వడ్డీ రుణాలు, స్వల్పకాలిక డిపాజిట్లపై ఆధారపడే స్థితికి దిగజారిందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా ఎగుమతుల వృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఆర్థిక స్థిరీకరణ ప్రయత్నాలు దీర్ఘకాలిక స్తబ్దతగా మారే ప్రమాదం ఉంది. ఫలితంగా, పాకిస్థాన్ తక్కువ వృద్ధి రేటు, మరో విదేశీ మారక నిల్వల సంక్షోభం మధ్య చిక్కుకుపోయే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక


# వంగూరి వాచకం- నవరత్నాలు

1 మనసు చాలా
తింగరి
దానిలా ఉంటుంది
స్టాక్ మార్కెట్ లాగ
ఉయ్యాల ఊగుతుంటుంది

2.ఒప్పు చేయడం
మాత్రమే కాదు నిజాయితీ
తప్పు ఒప్పుకోవడం
కూడా నీ జాతి నీతి.

3.కళ్ళు మురిస్తేనే మనసు
మైమరిస్తుందనుకుంటావా
నల్లగా ఉందని కోయిల
కూతలు వినడం

4.నిన్నటి గురించి
ఏల దిగులు
రేపటికై శ్రమించు
నేడు మిగుల.

5.మండుటెండలు ఒకవైపు
మండే ధరలు మరోవైపు చి
టోపి పెట్టేవారొకరు
పెట్టించేవారు మరొకరు.

6.అన్నిటికీ పెద్దది
కావాలంటే ఎలా
సూది చేసే పని
కత్తి చేయగలదా.

7.కుదిరితే
ఆహా... ఓహో...
చెదిరితే
లబోదిబో...

8.కాలమే
ఒక పెద్ద నియంత
క్షణమైనా ఆగని
చంచల దూత

9 ధనిక దేశాలకు కావచ్చేమో
యుద్ధం అంటే ముద్దు
ఇతర దేశాలకు అయ్యింది
అదొక పెద్ద ముప్పు.

వంగూరి గంగిరెడ్డి
షాద్ నగర్
9652286270



# నల్గొండలో ఘనంగా 157వ గాంధీ జయంతి.

## ఖైదీల సంక్షేమ దినోత్సవం.






**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ :** మహాత్మా గాంధీజీ 157వ జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని జిల్లా కారాగారం, నల్గొండలో ఘనంగా నిర్వహించారు. ఖైదీలలో మార్పు, సంస్కరణ, పునరావాసం, ఆత్మవిశ్వాసం , మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ బడుగు, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా , సెషన్స్ న్యాయమూర్తి కె. కవిత , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు , ఏ ఎస్ పి రమేష్ పాల్గొన్నారు.గాంధీజీ జీవితం -- ఖైదీలకు స్ఫూర్తిజిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ బడుగు, మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ ఔన్నత్యాన్ని వివరిస్తూ, గాంధీజీ తన జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. బారిస్టర్‌గా విద్యాభ్యాసం చేయడం నుంచి దక్షిణాఫ్రికాలో నల్లజాతి ప్రజల హక్కుల కోసం పోరాటం చేయడం, అనంతరం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించడం వరకు ఆయన జీవిత ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు."గాంధీజీ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాని కోసం పట్టుదలతో ముందుకు సాగారు. మీరు కూడా మీ జీవితంలో ఒక మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలి" అని ఖైదీలకు సూచించారు.అర్హులైన ఖైదీలు మరియు వారి కుటుంబాలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జైలు సంక్షేమ కార్యక్రమాల వార్షిక నివేదికఈ సందర్భంగా జిల్లా కారాగారం పర్యవేక్షణాధికారి కూన ఆనందరావు జైలు ఖైదీల సంక్షేమం, సంస్కరణ మరియు పునరావాసం కోసం సంవత్సర కాలంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన వార్షిక నివేదికను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ బడుగు, కి సమర్పించారు.నివేదికలో ఖైదీల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ సహాయం, విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ, ఉపాధి, పారిశ్రామిక కార్యకలాపాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమం , పునరావాస కార్యక్రమాలను వివరించారు.న్యాయ సహాయం -- పునరావాసానికి ప్రాధాన్యత1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి కె. కవిత మాట్లాడుతూ ఖైదీలకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, వారి న్యాయపరమైన సమస్యలను చట్టపరమైన పరిధిలో సత్వరం పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితాన్ని ఒక పుస్తకంతో పోల్చారు. "జీవితం అనే పుస్తకంలో ఒక పేజీ మాత్రమే ఇప్పుడు మన ముందు ఉంది. ఇంకా ఎన్నో పేజీలు మన ముందున్నాయి. ఆ పేజీలను ఉన్నతంగా రాసుకోవడం మన చేతుల్లోనే ఉంది" అని పేర్కొంటూ, గతాన్ని చూసి నిరాశ చెందకుండా భవిష్యత్తును ఉన్నతంగా మలుచుకోవాలని ఖైదీలకు స్ఫూర్తినిచ్చారు. ఏ ఎస్ పి రమేష్ మాట్లాడుతూ క్రమశిక్షణ, చట్టపట్ల గౌరవం, సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని, సమాజంలోకి తిరిగి వెళ్లిన తరువాత బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు.సాంస్కృతిక కార్యక్రమాలు -- ఖైదీల్లో మానసిక ఉల్లాసంఖైదీలలో మానసిక ఉల్లాసం, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనలను పెంపొందించే ఉద్దేశంతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఖైదీలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.అలాగే ఖైదీలలో శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి, పరస్పర సహకారం మరియు క్రమశిక్షణను పెంపొందించేందుకు వివిధ క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన ఖైదీలకు ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవం నిర్వహించి, అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఖైదీలలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, జైలు జీవితంలో మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని పేర్కొన్నారు.పాల్గొన్న అధికారులుకార్యక్రమంలో జైలు వైద్యాధికారి డా. సత్తు కిరణ్, జైలర్లు బాలకృష్ణ, అచ్చయ్య, జైలు సిబ్బంది చింత వెంకటేశ్వర్లు, శ్రీరామ్ జోగారావు, అజీమ్, సైదులు, అరుణ, రాంబాబు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, రామలింగం, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సత్యం, అహింస, మానవత్వం, క్రమశిక్షణ , సేవా భావాలను స్మరించుకున్నారు."గతం మన జీవితంలోని ఒక పేజీ మాత్రమే... భవిష్యత్తులో రాయాల్సిన పేజీలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆ పేజీలను మన చేతులతోనే అందంగా రాసుకుందాం" అనే స్ఫూర్తిదాయక సందేశంతో 157వ గాంధీ జయంతి -- ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమం ముగిసింది.

# డీసీసీలు వర్సెస్ నియోజకవర్గ ఇన్చార్జీలు

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో ఇన్చార్జీలకు పెరిగిన గ్యాప్**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అదే పంచాయితీ**

**నామినేటెడ్, పార్టీ పదవుల విషయంలో ముదురుతున్న వివాదం**

**ఆదిలాబాద్ లోకల్ గైడ్ అక్టోబర్ 3 :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి నాలుగు జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు 10 అసెంబ్లీ నియోజక వర్గాల ఇన్ చార్జీలకు నడుమ విపరీ తమైన గ్యాప్ పెరిగింది. ఇది కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలకు తీవ్ర ఇబ్బందిగా మారుతున్నది. నాలుగు జిల్లాల్లో ఏ ఒక్క నియోజకవర్గ ఇన్ చార్జీతో డీసీసీ అధ్యక్షులకు పూర్తిస్థాయి సఖ్యత లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ఈ వ్యవహారం పీపీపీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సహా సీఎం దాకా వెళ్లినట్లు చెబుతున్నారు. వ్యవహారాలను చక్కదిద్దాల్సిన జిల్లా ఇన్ చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఇందులో పెద్దగా తల దూరడం దూరడం లేదు. దీంతో డీసీసీ అధ్యక్షులు వర్సెస్ నియోజకవర్గ ఇన్చార్జీలు అన్నట్లుగా పార్టీ పరిస్థితి తయారయింది. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మరి కొందరు ముఖ్య నేతలు వర్గ విభేదాలు సృష్టించడం పనిగా పెట్టుకు న్నారన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న కొందరు కీలక నేతలకు నియోజ కవర్గ ఇన్చార్జీలతో విభేదాలు ఉన్న నేపథ్యంలో.. డీసీసీల తీరు ఆ నేతలకు కోతికి కొబ్బరి చిప్ప దొరికిన చందంగా తయారవుతున్నదని అంటున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబందించి నాలుగు జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు 10 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్ చార్జీలలకు నడుమ విపరీతమైన గ్యాప్ పెరిగింది. ఇది కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలకు తీవ్ర ఇబ్బందిగా మారుతున్నది. నాలుగు జిల్లాల్లో ఏ ఒక్క నియో అకవర్గ ఇన్చార్జీతో డీసీసీ అధ్యక్షులకు పూర్తిస్థాయి సఖ్యత లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సహా సీఎం కా వెళ్లి నట్లు చెబుతున్నారు. వ్యవహారాలను చక్కదిద్దాల్సిన జిల్లా ఆస ?వర్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం అందులో పెద్దగా తల దూర్చడం లేదు. దీంతో డీసీసీ అధ్యక్షులు వర్సెస్ నియో జకవర్గ ఇన్చార్జీలు అన్నట్లుగా పార్టీ పరిస్థితి తయారయింది. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మరి కొందరు ముఖ్య నేతలు వర్గ విభేదాలు సృష్టించడం పనిగా పెట్టుకున్నారన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న కొందరు కీలక నేతలకు నియోజకవర్గ జన్చార్జీలతో విభేదాలు ఉన్న నేపథ్యంలో... డిసిసిల తీరు ఆ నేతలకు కోతికి కొబ్బరి చిప్ప దొరికిన చందంగా తయారవుతున్నదని అంటున్నారు.

నాలుగు జిల్లాల్లో ఇదే పరిస్థితి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న నిర్మల్ అదిలాబాద్ మంచిర్యాల కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు ఆయా జిల్లాల్లో ఉన్న నియోజకవర్గాల ఇన్చార్జ్ లకు విభేదాలు కొనసాగుతున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ కు ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీరా శ్యాం నాయక్ సుమ తీవ్రస్థాయిలో విభేదాలు ఉన్నాయి. వీరద్దరి గొడవ గాంధీ భవన్ దాకా వెళ్ళింది. సిర్పూర్ నియోజకవర్గం లో నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంకా పూర్తిస్థాయిలో లేదు. ఆ నియోజకవర్గ బాధ్యతలు ఎమ్మెల్సీ దండే విట్టల్ చూస్తున్నారు. ఆయన డీసిసి అధ్యక్షు రాలు సుగుణతో పాటు ఆమెను వ్యతిరేకిస్తున్న వర్గంతో రెండు వైపులా సఖ్యత కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. అది లాబాద్ నియోజకవర్గంలో డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, గజేందర్ లకు పొసగడం లేదు. అ జిల్లాలో కొన్ని నియామ కవర్గ ఇన్ఛార్జిల సమ్మతి లేకుండా ఆ జిల్లాలో! కాలు ఇచ్చారని చేసిసి అధ్యక్షుడి పై పెసిసికి ఫిర్యాదులు వెళ్లాయి. నిర్మల్ నియోజకవర్గం లో డీసీసీ అధ్యక్షుడిగా కొన సాగుతున్న ఖానాపూర్ శాసనసభ్యుడు వెదు బొజ్జు పటేల్ కు నిర్మల్ నియోండవర్గ ఇవ్వాధ్ది శ్రీహరి రావు వడుడు అంతరం పెరిగిందని చెబుతున్నారు. అలాగే ముధోల్ నియోజకవర్గ ఇన్చార్జి నారాయణ రావు పటేల్ కూడా బొజ్జు పటేల్ పై అసంతృప్తి తో ఉన్నారని పార్టీలో ప్రచారం ఉంది. అలాగే మంచిర్యాల జిల్లాలో డిసిసి అధ్యక్షుడు పిన్నించి రామకృష్ణా రెడ్డి తో మంచిర్యాల శాసన సభ్యుడు ప్రేమ్ సాగర్ సాగర్ రావు కు విభేదాలు ఉన్నాయి. చెన్నూరు బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్చార్టీలుగా కొనసాగుతున్న గడ్డం బ్రదర్స్ తో డిసిసి అద్య కుడికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఒకటి రెండు నియోజ కవర్గాలు మినహా డిసిసి అధ్యక్షులకు నియోజకవర్గాల డీసీసీలు నియోజకవర్గ ఇన్చార్డ్ లకు పెరిగిన గ్యాప్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

నామినేటెడ్, పార్టీ పదవులపై ప్రభావం...

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అవు తుండగా... ఆయా నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న అనేక నామినేటెడ్ పదవుల భర్తీకి డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గం అన్నార్థిల పడుమ నెలకొన్న విభేదాలు భర్తీ కాకుండా పోతున్నాయి. కొన్నిచోట్ల నియామకాలు సజావుగానే సాగు తున్నప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో ఈ వివాదాలు గుదిబండగా మారుతున్నాయి. మండల నియోజకవర్గ స్థాయి పార్టీ పదవుల ఖరారు వ్యవహారం కూడా ఇబ్బందిగానే మారుతున్నదని చెబుతున్నారు. ఇప్పటికే డిసిసి అధ్యక్షులు నియోజకవర్గ ఇన్సాంలా నడుము నెలకొన్న గొడవల వ్యవహారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. రెండు జిల్లాల్లో ఇటీవల మండల పార్టీ అధ్యక్షులు నియామకం విషయంలో జరిగిన గొడవలపై ఇద్దరు డిసిసి డిసిసి అధ్యక్షుల మీద పిసిసి చీఫ్ అసహనం వ్యక్తం దేశారని ప్రచారం జరుగుతున్నది. భవిష్యత్తులో ఇలాంటి విభేదాలకు తావు లేకుండా చూడాలని నాలుగు జిల్లాల డిసిసి అధ్యక్షులకు నియోజకవర్గాల ఇన్నాస్త్రాలకు పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి కూడా సలహా ఇచ్చారని వెలుతున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్వర్యంలో ఇటీవల జరిగిన సమస్యయ సమావేశం తర్వాత భవిష్యత్తులో విభేదాలు లేకుండా చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.

# బెస్ట్ సేవా సొసైటి ఆద్వర్యం లో ఘణంగా జరిగిన గాంధీజీ జయంతి వేడుకలు

**వృద్దులకు దుప్పట్ల పంపిణీ**

**విద్యార్థులకు బహుమతుల పంపిణీ**



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. .బిలోకల్ గైడ్ :** బెస్ట్ సేవా సొసైటీ ఫౌండర్ బుక్కా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.వేడుకలకు కక్కిరేణి గ్రామ సర్పంచ్ పిట్ట రామ్ రెడ్డి పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు దాచేపల్లి ఈశ్వరయ్య తదితరులు పూలమాలతో ఘనంగా మహాత్మునికి నివాళులు అర్పించారు. అనంతరం బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, దుప్పట్ల పంపిణీ, పండ్ల పంపిణీ హై స్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలక మండలి సభ్యులను ఘనంగా సన్మానించారు తదనంతరం వృద్దులందరికి శద్దర్లు, పండ్ల పంపిణి చేయనైనదీ. ఈ సందర్భంగావ్యవస్థాప అధ్యక్షులు బుక్కా ఈశ్వరయ్య మాట్లాడుతూ 2016లో స్థాపించిన బెస్ట్ సేవా సొసైటీ ద్వారా పలు ప్రాంతాలలో అన్ని వర్గాలకు విద్యాసంస్థలకు వృద్ధాశ్రమాలకు అనాథ పిల్లలకు పలు రకాల సహాయ సహకారాలు అందించు చున్నామని కక్కిరేణి పాఠశాలలకు స్కూల్ బ్యాగులు భోజనం పల్లాలు, స్టేషనరీ, ఆట వస్తువులు కూడ ఇచ్చామని,గతంలో గ్రామంలో గల వృద్ధులకు రెండు పర్యాయములు చేతి కర్రలు దుప్పట్లు, పారిశుద్ధ కార్మికులకు గ్లౌజులు షద్దర్లు పంపిణీ చేయడం జరిగినది.మహాత్ముని జయంతి పురస్కరించుకొని ఈరోజు కూడా సేవా కార్యక్రమాలు చేయవలెనని తలంపుతో శుక్రవారం కార్యక్రమాలు చేపట్టనైనది.వృద్దులకు హెల్త్ చెకప్స్, దుప్పట్ల పంపిణి, పండ్ల పంపిణి, గ్రామ పంచాయతి సభ్యులకు. సన్మానం చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి సభ్యులు తోట వేణుగోపాలరావు, శ్రీదేవి, కుక్కడపు నరేష్, అల్లాని జ్యోతి, ఉప్పల రామక్రిష్ణ సహకారాలు,వేముల సైదులు, మిర్యాల రామకృష్ణ,కృషి కూడ కలదన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్ బ్రౌచర్ విడుదల

**బ్రౌచర్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లి**



**( లోకల్ గైడ్ షాద్ నగర్ ) :** కొందుర్గ్ మండల కేంద్రంలో కేకే మాస్టర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 6 నుంచి నిర్వహించనున్న మొదటి రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఎక్లాస్‌ఖాన్‌పేటలోని తన స్వగృహంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడ స్ఫూర్తిని పెంపొందించే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, వార్డు సభ్యులు శ్రీకాంత్, నాయకులు,గుడిసె పద్మారావు, మాలకుంట్ల ప్రవీణ్, జిల్లెల రమేష్, గుడిసె సచిన్, కరాటే నిర్వాహకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# పేరుపల్లిలో దుర్గామాత ఉత్సవాలకు సర్పంచ్ పద్మావతి శ్రీకారం

**స్టేజి కర్ర పూజలో పాల్గొన్న సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం**



**కారేపల్లి , అక్టోబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్):** విజయదశమి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పేరుపల్లి గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీ ఆవరణంలో దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో శనివారం నిర్వహించిన స్టేజి కర్ర పూజ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి ప్రత్యేక పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామంలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, యువత సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కేలోతు హంకీ గన్నోజి పద్మ, దామల్ల ఉపేంద్ర, సముద్రాల ఉమా, దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

# తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల ఐక్యవేదిక, తెలంగాణ బ్రాహ్మణఐక్యవేదిక తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవంవేదిక ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ.




**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ :** నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయం వేదికగా తెలంగాణ బ్రాహ్మణ ఐఖ్యవేదిక తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల ఐఖ్యవేదిక సంయుక్తంగా తలపెట్టిన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించిన నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ చరిత్రలో ఆడబిడ్డలకు ప్రత్యేక స్థానం ఉందని... మాతృత్వ మాధుర్యాన్ని పంచి పెట్టగలరు.. మరణానికివెరవక, ఆయుధం చేపట్టిన చరిత్ర తెలంగాణ మహిళలదని అన్నారు ... తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర చేపట్టటం ... చాలా మంచి కార్యక్రమం అని.. ఏ అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యులకు అవమానం జరిగిందో అక్కడ నుండే ఈ యాత్ర ప్రారంభిస్తే.. బావుంటుందని సూచించారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో బ్రాహ్మణులకు అత్యంత ప్రాధాన్యత గౌరవం దక్కిందని 100 కోట్లతో బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేశారని పేద బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ విద్య కొరకు 20 లక్షలు ఇచ్చారని.. ధూప దీప నైవేద్య స్కీం కింద మొదట ఆరు వేలు ఆ తర్వాత పదివేలకు వారి గౌరవ వేతనాలు పెంచారని... కెసిఆర్ ప్రభుత్వ హాయంలో సంబండవర్గాలు... సంతోషంగా ఉన్నాయని...

**కానీ దురదృష్టవశాత్తు నేడు... రౌడీ రాజ్యం నడుస్తుందని...**

బ్రాహ్మణ పరిషత్ కు... బస్వరాజు శ్రీనివాస్ లాంటి వ్యక్తిని చైర్మన్ చేయడం అత్యంత దురదృష్టకరమని... ఇలాంటి వ్యక్తుల వల్ల.. వారి వ్యవహార శైలి వల్ల అటు ప్రభుత్వము, ఇటు బ్రాహ్మణ సంఘాలపలుచనైపోతున్నాయని అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల ఐక్యవేదిక.. కలిసి చేస్తున్న తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్ష యాత్రకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని... ఉద్యమాలఖిల్ల నల్లగొండ గడ్డపై నుండి.. ఈ యాత్ర ప్రారంభించడం మీకు విజయాన్ని చేకూరుస్తుందని.. అన్ని బ్రాహ్మణ సంఘాలు కలిసి ఐక్యంగా ముందుకు పోవాలని.. తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ బ్రాహ్మణ సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ దేవులపల్లి రంగారావు గంప రామ శర్మ కిరణ్ కుమార్ శర్మ,కంచనపల్లి రవీందర్రావు,గుడా జయ రామ్,గూడా రాజేశ్వరరావు ,నారపరాజు రజనీరావు, జ్యోతి కులకర్ణి,చకిలంవేణుగోపాలరావు కందాలశ్రీనివాసాచార్యులు, పసునూరి రాంబాబు,ఉడుగు వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# జైలు జీవితం నుండి బయటికి వచ్చిన తర్వాత గాంధీజీని ఆదర్శంగా తీసుకొని జీవించాలి.

## జిల్లా కలెక్టర్ బడుగుల. చంద్రశేఖర్.




**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్. :** జైలు జీవితం నుండి బయటికి వచ్చిన తర్వాత గాంధీజీని ఆదర్శంగా తీసుకొని జీవించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఖైదీలకు పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఖైదీలు జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత నవ సమాజ నిర్మాణం లో భాగస్వాములు కావాలని, ఇందుకు ఖైదీలలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, ముందుగా అ మార్పు తనలోనే రావాలని, గతంతో పోలిస్తే సమాజంలో ప్రస్తుతం అనేక మార్పులు వచ్చాయని, ఒకప్పుడు చదువు అంతగా ఉండేది కాదని, ప్రస్తుతం అందరూ చదువుకోవాలని కోరుకుంటున్నారని, జైలులో చదువు రాని ఖైదీలు తప్పనిసరిగా చదువు నేర్చుకోవాలని, జిల్లా యంత్రాంగం తరపున బోధకులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమాజానికి తగ్గట్టుగా అందరూ నడవడికను మార్చుకోవాలని, చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండాలని చెప్పారు. "పాఠశాలలో ఎక్కువ మంది ఉండాలి, జైల్లో తక్కువ మంది ఉన్నప్పుడే" ఆ సమాజం బాగుపడుతుందని అన్నారు. ప్రభుత్వం ఖైదీలకు జైలులో అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతున్నదని, వాటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని, శిక్ష అనుభవించి బయటికి వచ్చిన ఖైదీలు ఒక లక్ష్యంతో జీవించాలని, స్వయం ఉపాధి చూసుకోవాలని ,ప్రభుత్వం కూడా స్వయం ఉపాధి కల్పించేందుకు సహకరిస్తుందని తెలిపారు. జైల్లో మంచి అలవాట్లను నేర్చుకుని మంచి మనిషిగా బయటకు రావాలని ఆయన పిలుపునిచ్చారు .జిల్లా మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి కె. కవిత మాట్లాడుతూ జైల్లో ఖైదీలకు అనేక సౌకర్యాలు ఉన్నాయని, ఖైదీలు వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఓపికగా ఉండి సంస్కారవంతులై జైలు నుండి బయటకు రావాలని పిలుపునిచ్చారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ ,సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు మాట్లాడుతూ ఖైదీలు మానవతా విలువలు నేర్చుకోవాలని, వారిని వారే మార్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, చదువురాని వారు చదువుకోవాలని, జైల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అదనపు ఎస్ పి రమేష్ మాట్లాడుతూ చిన్న చిన్న తప్పిదాల వల్ల జైలు పాలైన వారు తప్పులు చేస్తే ఎలాంటి శిక్షలు ఉంటాయో చట్టాలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అలాగే సమాజాన్ని గురించి కూడా తెలుసుకోవాలని, జైలు జీవితం తర్వాత మంచి పౌరులుగా మెలగాలని చెప్పారు. జైలు సూపరింటెండెంట్ కే. ఆనందరావు, జిల్లా జైలు డాక్టర్ కిరణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ,ఎడిజేలు వివిధ పోటీలలో గెలుపొందిన ఖైదీలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైలర్ అచ్చయ్య,బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చిలకమర్రి రాంరెడ్డి



# చిన్న వయసులోనే విషాదాంతం.. విజయకు కన్నీటి వీడ్కోలు

రావూరి శ్రీనివాసరావు, అజ్మీరా వీరన్న నివాళి



**కారేపల్లి, అక్టోబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్):** కారేపల్లి మండలం చంద్రలగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి యువతి ధనసరి విజయ జ్వరంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులను తీవ్రంగా కలచివేసింది. విజయ మృతి విషయం తెలుసుకున్న వైరా మాజీ ఆత్మ కమిటీ చైర్మన్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా వీరన్న శనివారం చంద్రలగూడెం గ్రామానికి చేరుకుని విజయ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పీఈటీగా విధులు నిర్వహిస్తున్న విజయ జ్వరంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని వారు పేర్కొన్నారు. విజయ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విజయకు చదువుతో పాటు క్రీడలంటే ఎంతో ఇష్టమని ఆమె సోదరుడు ధనసరి రాంబాబు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న విజయను కోల్పోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విజయకు నివాళులర్పించిన వారిలో భూక్యా హరియా నాయక్, దల్‌సింగ్, మూలకం వెంకన్న, గుగులోత్ శ్రీను, ధరావత్ రవి, అజ్మీరా ప్రసాద్, సమ్మయ్య, కోటేష్, పోతురాజు, శివ, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి

మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా



**లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో :** వికారాబాద్ లో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ అర్త సుధాకర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితిని, వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాద బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం మరియు పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళ మాధవిపై3 దాడి నీ తీవ్రంగా ఖండిస్తున్నాం .

నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం

కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

ఎంఎస్పి నల్గొండ జిల్లా అధ్యక్షులు.

బకరం శ్రీనివాస్ మాదిగ.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.. లోకల్ గైడ్. :** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీ.కే. మల్లెపల్లి గ్రామంలో గ్రామ సభ సందర్భంగా దళిత మహిళ వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన దాడిని ఎంఎస్పి నల్గొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగతీవ్రంగా ఖండించారు. గ్రామ సభ సందర్భంగా గనిపల్లి మాధవిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటన అత్యంత ఆందోళనకరమని అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా వెలుగులోకి వచ్చిందని, దళిత మహిళపై బహిరంగంగా దాడి చేయడం ప్రజాస్వామ్య సమాజంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. గ్రామ సభలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సి ఉండగా, ఒక మహిళను కులపరంగా అవమానించడం, అసభ్య పదజాలంతో దూషించడం, దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత దళిత మహిళకు తక్షణ రక్షణ కల్పించడంతో పాటు, ఆమెకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో నల్లగొండ జిల్లాలో దళితులు, గిరిజనులపై కుల దూషణలు, దాడులు, హత్యలు, అత్యాచారాలు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ వాటిని అరికట్టడంలో పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బకరం శ్రీనివాస్ మాదిగ అన్నారు. దళితులు, గిరిజనులపై దాడులు జరిగితే కఠినంగా వ్యవహరించి, బాధితులకు తక్షణ న్యాయం అందించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. నల్లగొండ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పర్యవేక్షించి, జిల్లాలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చట్టపరమైన రక్షణ, న్యాయం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## కొందుర్గ్ లోడిసెంబర్ 06 న కరాటే టోర్నమెంట్...

క్రీడలు ఆత్మ రక్షణలోనూ నిత్య జీవితంలోను ఎంతో ఉపకరిస్తాయి

రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ వాల్ పోస్టర్ విడుదల చేసిన..

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..

గ్రామ సర్పంచ్ చౌడపురం ప్రభాకర్...



**లోకల్ గైడ్ న్యూస్ 03 కొందుర్గ్..:** కొందుర్గ్ మండల కేంద్రంలో కేకే మాస్టర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 6 నుంచి నిర్వహించనున్న మొదటి రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎక్లాస్‌ఖాన్‌పేట లోని తన స్వగృహంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడ స్ఫూర్తిని పట్టుదలను నింపటమలో క్రీడలు ఎంతో ఉపయోగ పదార్థాయని ప్రతి ఒక్కరు నిత్య జీవితంలో క్రీడా స్ఫూర్తిని అవలంబించాలని ఈ టోర్నమెంట్ ప్రతిస్తాకంగా చాలా చక్కగా విజయవంతం కావాలని ఆకాంక్షించారు,..ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, వార్డు సభ్యులు శ్రీకాంత్, నాయకులు,గుడిసె పద్మారావు,మాలకుంట్ల ప్రవీణ్,జిల్లెల రమేష్,గుడిసె సచిన్,కరాటే నిర్వాహకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తోంది...

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఎల్‌నినో పరిస్థితుల్లో చెక్‌డ్యామ్

నిర్మాణంతో రైతులకు ఎంతో ప్రయోజనం

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి కులం, మతం,

రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు

కట్టుకాచారం గ్రామంలో 35 నెలల్లో రూ.13.50 కోట్లతో

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

రూ. 6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్ ప్రారంభం

రూ.2.50 కోట్లతో కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు

వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి

శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం, అక్టోబర్ 03: లోకల్ గైడ్:** ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.6.65 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ చెక్‌డ్యామ్‌తో కట్టుకాచారం, కొత్తగూడెం, పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. రాయగూడెం నుంచి తక్కెళ్లపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, కట్టుకాచారం గ్రామ అంతర్గత రోడ్లకు రూ.52 లక్షలు, విద్యుత్ లైన్ల మార్పిడికి రూ.7.50 లక్షలు, తాగునీటి వసతుల కోసం రూ.3.50 లక్షలు, అంగన్‌వాడీ భవనం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కట్టుకాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 35 నెలల్లో సుమారు రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని మంత్రి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కట్టుకాచారం వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తవడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. చెక్ డ్యామ్ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడు తుందని అన్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణంతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తాగునీటి సమస్య కూడా ఏర్పడుతోందని, ఎల్‌నినో ప్రభావంతో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎదురవు తున్నాయని మంత్రి తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి కూడా సవాలుగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణను ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడేలా ముందుకు తీసుకెళ్లేందుకు విద్యుత్ ఎంతో అవసరమని మంత్రి అన్నారు. సౌర, తదితర ప్రత్యామ్నాయ వనరుల నుంచి విద్యుత్‌ను సమకూర్చుకునేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను వారి ఇంటి వద్దకే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు:

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలకు మద్దతు ఇచ్చే అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రెండవ విడతలో సుమారు 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.

చెక్‌డ్యామ్‌తో 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇటీవల సమీప గ్రామంలో పర్యటించిన సమయంలో చెక్‌డ్యామ్ వల్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నట్లు గమనించామని తెలిపారు. కట్టుకాచారం వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ ద్వారా సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ చెక్‌డ్యామ్‌తో భూగర్భ జలాలు కూడా మెరుగుపడతాయని, గ్రామంలో నీటికి ఇబ్బంది లేకుండా నీటి లభ్యత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రూ.6.65 కోట్ల వ్యయంతో చేపట్టిన చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ఈ చెక్‌డ్యామ్ రైతులకు, గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ సైదులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేట్ బస్సు బోల్తా ఐదుగురు దుర్మరణం, 40 మందికి తీవ్ర గాయాలు

సంఘటనా స్థలాన్ని పరిశీలించి,

బాధితులను పరామర్శించిన వికారాబాద్

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,





**లోకల్ గైడ్ వికారాబాద్:వికారాబాద్ జిల్లా బ్యూరో :** వికారాబాద్ అనంతగిరి ఘాట్ రోడ్డులో ఘోర రహదారి ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు నియంత్రణ తప్పి బోల్తా పడిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, దాదాపు 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే వికారాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది.

అంత్యక్రియలకు వెళ్తుండగా తలపడిన విషాదం:

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కేసారం గ్రామానికి చెందిన ప్రయాణికులు వికారాబాద్ జిల్లా దారూర్ మండలం చింతకుంట గ్రామంలో జరుగుతున్న అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ప్రైవేట్ బస్సులో బయలుదేరారు. మార్గమధ్యలో అనంతగిరి ఘాట్ రోడ్డులోని మలుపు వద్ద బస్సు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, 40 మంది ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు.

సంఘటనా స్థలంలో ఎస్పీ సమీక్ష:

ప్రమాద వార్త తెలిసిన వెంటనే వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులను వెంటనే అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తరలించడం, ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను పునరుద్ధరించడం మరియు సహాయక చర్యలను వేగవంతం చేయడంపై అధికారులకు స్పష్టమైన ఆజ్ఞలు జారీ చేశారు.

ఆసుపత్రిలో బాధితులకు పరామర్శ:

అనంతరం ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా కలెక్టర్‌తో కలిసి వికారాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితో పాటు క్షతగాత్రులు చికిత్స పొందుతున్న వివిధ ఆసుపత్రులను సందర్శించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులందరికీ అత్యవసర మరియు మెరుగైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాధితులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

# ఆర్ టి సి ఎన్నికలలో ఎంప్లాయిస్ కూటమిని గెలిపించండి.

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహ రెడ్డి.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్. :** ఈ నెల తొమ్మిదవ తేదీన జరిగే ఆర్టీసీ ఎన్నికలలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు పల్లా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు .శనివారం దేవరకొండ డిపో వద్ద ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ కోసం కార్మికుల సంక్షేమ కోసం ఎంప్లాయిస్ యూనియన్ గెలవాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం ఏఐటియుసి ఎర్రజెండా పోరాడుతుందని అన్నారు.ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు, టి ఎమ్ యు రాష్ట్ర కార్యదర్శి థామస్ రెడ్డి,ఏఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పల్లా దేవేందర్ రెడ్డి. ఎన్ ఎమ్ యు రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి ఎస్ .రహిముద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈ యు -- టి ఎమ్ యు -- ఎన్ఎమ్ యు -- జాక్ కూటమిని గెలిపించాలనీ ఆర్టీసీ కార్మికులకు పిలుపునిచ్చారు.ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం, కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై కార్మికులు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. బస్ డిపోల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆర్టీసీ కార్మికులను కలిసి కూటమికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఎన్నికలు కావడంతో ప్రతి కార్మికుడు బాధ్యతగా ఆలోచించి ఓటు వేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా నిలవాలని సూచించారు."కార్మికుల ఐక్యతే బలం -- ఈ యు , టి ఎమ్ యు , ఎన్ ఎమ్ యు , జాక్ కూటమినే గెలిపిద్దాం"అన్నారు. ఎన్నికల ముందు ఆర్భాటం చేసి కార్మికులను ప్రలోభాల గురిచేసి ఎన్నికల తర్వాత కనుమరుగయ్యే నాయకుల గురించి జాగ్రత్తగా ఆలోచించి ఈ ఎన్నికల్లో వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఏ పార్టీ ఉన్న కార్మికుల హక్కుల కోసం కొట్లాడి సాధించే సంఘాలు మనవి అని అన్నారు. రాష్ట్ర గుర్తింపులో బస్సు గుర్తుకు నల్లగొండ స్థానిక గుర్తింపులో నిచ్చెన గుర్తుకు ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ రెడ్డి బి వెంకటయ్య, మంగ,జిల్లా అధ్యక్షులు జామాల్ గౌడ్ కార్యదర్శి ఎన్ ఆర్ సి రాజు జాక్ నాయకులు డివి నారాయణ, రాఘవ రెడ్డి,హరి,జనార్దన్ రెడ్డి,శీ యాదయ్య, సీతారాం నాయక్, శ్రీనివాస్,సిపిఐ కార్యదర్శి మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, ఎన్ రామస్వామి, పల్లా రంగా రెడ్డి,వి ఆంజనేయులు, వెంకట్రాములు, మల్లయ్య, దాస్, మైనుద్దీన్, కేస్యనాయక,ఉస్మాన్, మన్సూర్, యాదయ్య బారీములు, గోవర్ధన్ పాల్గొన్నవారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి .



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్. :** గతంలో పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదయి ఉన్నవారు కూడా మళ్లీ ఓటునుఅర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వేముల గోపీనాథ్ మాట్లాడుతూ 28 సెప్టెంబర్ 2026 నుంచి 06 నవంబర్ 2026 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అభ్యర్థి పూర్తి వివరాలతో కూడిన ఫారం--18 దరఖాస్తు చేసుకోవాలని,2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత పొందినట్లు నిర్ధారించే కాన్వొకేషన్ సర్టిఫికెట్ / ప్రొవిజనల్ సర్టిఫికెట్,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ,సాధారణ ఓటర్ ఐడీ జిరాక్స్ కాపీ,2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు,మొబైల్ నంబర్ అర్హత ఉన్న పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గ్రీన్ వుడ్ స్కూల్ విద్యార్థిని 'జాగృతి' ఎంపిక




**భూపాలపల్లి: (లోకల్ గైడ్ ప్రతినిధి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని జీడి జాగృతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. తన క్రీడా నైపుణ్యంతో రాణించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.రాష్ట్ర స్థాయికి ఎంపికైన సందర్భంగా క్రీడాకారిణి జాగృతిని పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ "జాగృతి క్రమశిక్షణ, నిరంతర శ్రమ మరియు క్రీడల పట్ల ఉన్న అంకితభావమే ఈ విజయాన్ని అందించాయి. రాజన్న సిరిసిల్లలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా తను అద్భుత ప్రతిభ చాటి మన పాఠశాలకు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాం. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని అన్ని రంగాల్లో ముందుకు నడిపించడమే మన గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ స్కూల్ యొక్క ముఖ్య ఉద్దేశం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయిా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జాగృతికి అభినందనలు తెలపడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించాలని శుభాకాంక్షలు అందించారు.

## రగ్బీలో కారేపల్లి మైనార్టీ గురుకుల విద్యార్థుల సత్తా

అండర్-15లో రన్నరప్.. అండర్-18లో మూడో స్థానం



**కారేపల్లి, అక్టోబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్):** ఖమ్మం పట్టణంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సెప్టెంబర్ 29న నిర్వహించిన అస్మిత సిటీ రగ్బీ లీగ్ పోటీల్లో కారేపల్లికి చెందిన వైరా మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో జరిగిన రగ్బీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అండర్-15 విభాగంలో హోరాహోరీగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రన్నరప్‌గా నిలిచి ద్వితీయ స్థానాన్ని సాధించారు. అదేవిధంగా అండర్-18 విభాగంలోనూ పోటీతత్వాన్ని ప్రదర్శించి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రెండు విభాగాల్లోనూ విద్యార్థులు పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థులు సాధించిన విజయాలపై పాఠశాల ప్రిన్సిపాల్ డి. సావిత్రి హర్షం వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విజేత విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా రగ్బీ శిక్షణ అందిస్తూ, వారి ప్రతిభను మెరుగుపరిచేందుకు కృషి చేసిన పీఈటీ, పీడీలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

## నేడు జరిగే,ఓబిసి సింహా గర్జన సభను విజయ వంతం చేద్దాం..

జాతీయ జనగణనలో ఓబిసి లకులగణన లెక్కించాలి......

ఓబిసి లకు 42 శాతం రిజర్వేషన్ లసాధన కోసం....

కోగురి పురుషోత్తం రెడ్డి కొందుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు...

షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన --కృష్ణారెడ్డి..





**లోకల్ గైడ్ న్యూస్ 03 కొందుర్గ్..:** శంషాబాద్ లోనీ స్థానిక గొల్లపల్లి రోడ్డు లో నిర్వహించ తలపెట్టిన జాతీయ జనగలనలో ఓ బి సి ల కులగణన.సాధన కొరకుశంషాబాద్ లో రాష్ట్ర ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించబడును నేడు మధ్యాహ్నం 3:00 గంటలకు గొల్లపల్లి రోడ్డుశంషాబాద్ లో భారీ బహిరంగ సభ నిర్వహించబడును. కాబట్టి ఓబిసి సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్న పిలుపు మేరకు నిర్వహించటం జరుగుతుందని ఆయన అన్నారుఈ ప్రెస్ మీట్ కు కొందుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొగురి పురుషోత్తం రెడ్డి మరియు షాద్ నగర్ ఏ యం సి చైర్మన్ సులోచన కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓ బి సి లకు ఇస్తున్న ప్రాధాన్యత, 42% రిజర్వేషన్ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శంషాబాద్ లో నేడు జరిగే ఓబిసి సింహ గర్జనకు కొందుర్గ్ మండలం నుండి పెద్ద ఎత్తున ప్రజలు కార్యకర్తలు నాయకులు తరలి వెళ్ళాలనిపిలుపునిచ్చారు ఓ బీసీ లకు ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకరన్న చేస్తున్న కృషికి మన వంతుగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుదాం. అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోగురి పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కొందుర్గు మాజీ సర్పంచ్ ఫయం,మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లేష్ గౌడ్,రాములు గౌడ్,గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీ కాడిగళ్ల మహేందర్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బొరిగె యాదయ్య సమన్వయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ ఫయ్యూమ్ భాయ్,రాములు బోరిగే నరేందర్ డైరెక్టర్ భీమారం నన్నయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మల్లని యాదయ్య గ్రామ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కడిగల్ల పద్మయ్య డా.. జిల్లెల్ల జంగయ్య వార్డ్ సభ్యులు దుర్గను శ్రీను, జిల్లెల్ల ప్రవీణ్ చేవెళ్ల కృష్ణయ్య చీలం వేణు,తీగలపల్లి గోపాల్ మచ్చ అమృతయ్య కొత్త సెల్వ రెడ్డి,పుత్ర రమేష్, నడిమింటి రాజు,మన్మర్రి శశి కుమార్, కుమార్ దుర్గను రాజు తదితరులు పాల్గొన్నారు...

# రైతు సమస్యలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

పంట నష్టంపై కేంద్రంపై ఒత్తిడి తేవాలి..

సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి.

నవంబర్ 15 నుంచి నల్లగొండలో అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలు ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రైతు సంఘం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ . :** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, రైతు సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు తీసుకుని చర్యలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభ ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రైతు సంఘం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయం దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ నగరంలో అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు కమిటీలు ఏర్పాటు చేసి రైతుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. రైతుల నుంచి ఆశించిన దానికంటే అధిక స్పందన లభిస్తోందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రాజెక్టులు, నదులు ఉన్నప్పటికీ వాటి నీటిని సక్రమంగా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు.పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు కరువు నుంచి బయటపడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర బృందాలను రాష్ట్రానికి రప్పించి కరువు పరిస్థితులు, పంట నష్టాన్ని పరిశీలించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.సాగునీరు విడుదల చేయాలిఉన్న పంటలకు యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని జూలకంటి రంగారెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి మరింత నీటిని విడుదల చేస్తే భూగర్భజలాలు పెరిగి బావులు, కుంటలు నిండడంతో పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ప్రస్తుత పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లాలో వందేళ్ల చరిత్రలో తొలిసారిగా అఖిల భారత స్థాయి రైతు మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. దేశం నలుమూలల నుంచి రైతు నాయకులు మహాసభలకు హాజరుకానున్నారని చెప్పారు. రైతు పోరాటాలు సాగిన ప్రాంతాల్లోనే మహాసభలు నిర్వహించాలన్న కేంద్ర నాయకత్వ నిర్ణయంలో భాగంగా నల్లగొండను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రజలు, మేధావులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని జూలకంటి రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు .అఖిల భారత రైతు మహాసభలు నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు. నవంబర్ 15న లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. నాలుగు రోజులపాటు జరిగే మహాసభలకు దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాల్లో పనిచేస్తున్న సుమారు 2,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు.దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించి, వ్యవసాయ రంగ పరిరక్షణకు అవసరమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని సుదర్శన్ తెలిపారు.కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అనుసరిస్తోందని ఆయన ఆరోపించారు. విత్తనాలు, రుణాలు, ఎరువులు, మార్కెటింగ్, గిడ్డంగుల రంగాల్లో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.కనీస మద్దతు ధర నిర్ణయంలో రైతు పెట్టుబడి, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదని సుదర్శన్ విమర్శించారు. రైతులు రుణభారంలో కూరుకుపోయి వ్యవసాయం నుంచి తప్పుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. దేశ జనాభాలో పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నందున వ్యవసాయాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.గతంలో కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 390 రోజులపాటు ఢిల్లీలో ఉద్యమించి వాటి ఉపసంహరణకు కారణమయ్యారని సుదర్శన్ గుర్తుచేశారు. విద్యుత్, నీరు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు తదితర రంగాలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను రైతాంగం వ్యతిరేకిస్తుందని తెలిపారు.వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నల్లగొండ చారిత్రక కేంద్రంగా నిలిచిందని సుదర్శన్ అన్నారు. అలాంటి పోరాటాల స్ఫూర్తి ఉన్న నల్లగొండలో అఖిల భారత రైతు మహాసభలు జరగడం ప్రాధాన్యమైందన్నారు. భవిష్యత్‌లో వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం చేపట్టే ఉద్యమాలకు ఈ మహాసభలు వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.మహాసభలను విజయవంతం చేసేందుకు నల్లగొండ ప్రజలు, ముఖ్యంగా రైతాంగం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహాసభల నిర్వహణకు మీడియా ప్రతినిధులు కూడా సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు నల్లగొండలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ తెలిపారు.గత మూడేళ్లలో జరిగిన రైతు ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించి, రాబోయే మూడేళ్ల కార్యాచరణను మహాసభల్లో రూపొందిస్తామని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి అనుకూలంగా ఉన్న విధానాలను నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. పంటల బీమా రైతులకు కాకుండా బీమా కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 500 రైతు సంఘాలు పంటల బీమా పథకాన్ని రైతులకు ఉపయోగపడేలా మార్చాలని డిమాండ్ చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు.దిగుమతులతో దేశీయ రైతులకు నష్టంస్వదేశీ, ఆత్మనిర్భర్ భారత్ గురించి కేంద్రం మాట్లాడుతూనే విదేశాలతో కుదుర్చుకుంటున్న ఒప్పందాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అవకాశం కల్పిస్తోందని తీగల సాగర్ విమర్శించారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో వేరుశనగ, నువ్వులు, కుసుమ తదితర పంటలు పండించే రైతులు నష్టపోతున్నారని అన్నారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని 30 శాతం నుంచి 11 శాతానికి, ప్రస్తుతం సున్నాకు తగ్గించడంతో పత్తి రైతులకు మద్దతు ధర లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలను కాపాడే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతు సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమంకేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 500 రైతు సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. లఖింపూర్ ఖేరీ ఘటనలో మృతి చెందిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న పేద, మధ్యతరగతి రైతుల భూముల సమస్యలను పరిష్కరించాలని తీగల సాగర్ డిమాండ్ చేశారు. పెళ్లిళ్లు, పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం భూములు విక్రయించుకునే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చట్టవిరుద్ధంగా మిగులు భూములు ఉన్నచోట వాటిని గుర్తించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరారు.అసైన్డ్, ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతుల సమస్యలను కూడా పరిష్కరించాలని అన్నారు. ధరణి స్థానంలో భూభారతి తీసుకొస్తామని చెప్పిన ప్రభుత్వం మూడేళ్లుగా భూసమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు .ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తగిన సహాయం ప్రకటించలేదని తీగల సాగర్ అన్నారు. తెలంగాణ నుంచి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నందున రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న కరువు సమస్యపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వాణిజ్య పంటలు, ఆహార ధాన్యాల పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నారి ఐలయ్య, బండ శ్రీశైలం, ఎండి హాశం, కందాల ప్రమీల, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, దండంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఎస్పీఆర్ హైస్కూల్' యాజమాన్యానికి నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి తీవ్ర హెచ్చరిక.

**45 రోజులు గడిచినా పేరు మార్పు ప్రతిపాదనలు సమర్పించకపోవడంపై డీఈవో ఆగ్రహం .**

**కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తే కరస్పాండెంట్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు. విద్యాశాఖ ఉత్తర్వులు**

**ఆర్టీఐఎస్ఎస్ పోరాటంతో కదిలిన యంత్రాంగం .**

**అధికారిక ప్రొసీడింగ్స్ జారీ**

**అనుమతులు లేని అక్రమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి మోసపోవద్దు.**

**కేతావత్ బాబురామ్ నాయక్, కలకుంట్ల వినోదాచారి హెచ్చరిక .**



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్. :** నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డు మరియు కొండమల్లేపల్లిలలో సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న 'ఎస్పీఆర్ హైస్కూల్' అక్రమ నిర్వహణపై జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) పి. సుశీంద్ర రావు తీవ్రంగా స్పందించారని రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టీఐఎస్ఎస్) వ్యవస్థాపకుడు మరియు జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల వినోదాచారి తెలిపారు. ఆర్టీఐఎస్ఎస్ సమర్పించిన పక్కా ఆధారాలు, వినతిపత్రాల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారిక ప్రొసీడింగ్స్ ఆర్సీ నెంబరు: 1455/బి2/2024, తేదీ: 29.09.2026 విడుదల చేసిందని వారు పేర్కొన్నారు. ?ఈ సందర్భంగా ఆర్టీఐఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ గౌరవ తెలంగాణ హైకోర్టు తీర్పు (రిట్ పిటిషన్ నెంబరు: 12250/2026), రంగారెడ్డి జిల్లా వాణిజ్య న్యాయస్థానం (కమర్షియల్ కోర్టు) శాశ్వత నిషేధాజ్ఞలు (ఇంజంక్షన్ ఉత్తర్వులు) మరియు పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకుల (ఆర్జేడీఎస్ఈ - హైదరాబాద్) ఆదేశాల ప్రకారం 'ఎస్పీఆర్' అనే పేరును ఉపయోగించకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయని గుర్తుచేశారు. సదరు పాఠశాల యాజమాన్యం 'ఎస్పీఆర్' అనే పదం లేకుండా నూతన పేరు మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ ఆదేశించినప్పటికీ, 45 రోజుల చట్టబద్ధమైన గడువు ముగిసినా ఎలాంటి ప్రతిపాదనలు సమర్పించకుండా యాజమాన్యం బేఖాతరు చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారని వివరించారు. ఇప్పటికైనా 'ఎస్పీఆర్' అనే పేరు వాడకుండా తక్షణమే పేరు మార్పు ప్రతిపాదనలు పంపాలని, లేనిపక్షంలో తలెత్తే తీవ్ర చట్టపరమైన పరిణామాలకు కరస్పాండెంట్ వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని మరియు పాఠశాల గుర్తింపు రద్దు కోసం ఆర్జేడీఎస్ఈ హైదరాబాద్ కార్యాలయానికి తదుపరి నివేదిక పంపుతామని డీఈవో ప్రొసీడింగ్స్‌లో గట్టిగా హెచ్చరించినట్లు వారు వెల్లడించారు.

**అనధికార పాఠశాలను తక్షణమే సీజ్ చేసి మూసివేయాలి:**

విద్యాశాఖ నుండి నూతన పేరుతో అధికారిక అనుమతులు లేకుండా, న్యాయస్థానాల ఆదేశాలను ఉల్లంఘిస్తూ పాఠశాల తరగతులు నడపడం మరియు కొత్త విద్యార్థుల ప్రవేశాలు (అడ్మిషన్లు) చేపట్టడం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ చట్టం - 2009) ప్రకారం తీవ్రమైన నేరమని బాబురామ్ నాయక్, కలకుంట్ల వినోదాచారి స్పష్టం చేశారు. వీటికి తోడు కొండమల్లేపల్లి క్యాంపస్ స్థానిక చెరువు యొక్క పూర్తి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) / బఫర్ జోన్ ముంపు ప్రాంతంలో అక్రమంగా నిర్మించబడిందని, కనీస అగ్నిమాపక రక్షణ (ఫైర్ ఎన్ఓసీ) అనుమతులు లేకుండా ప్రమాదకరంగా అక్రమ బాలుర హాస్టల్‌ను నడుపుతున్నారని ఆరోపించారు.

తల్లిదండ్రులు ఇలాంటి వివాదాస్పద మరియు గుర్తింపు లేని సంస్థలలో పిల్లలను చేర్పించి మోసపోవద్దని వారు విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న పాఠశాల ప్రాంగణాలను, అక్రమ హాస్టల్‌ను తక్షణమే అధికారులు భౌతికంగా సీజ్ చేసి మూసివేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం సెక్షన్ 18(5) నిబంధనల ప్రకారం ఉల్లంఘన జరిగిన ప్రతి రోజుకు పది వేల రూపాయల (10,000) చొప్పున లెక్కించి పూర్తి జరిమానా వసూలు చేయాలని, తప్పుడు ప్రచారాలతో తల్లిదండ్రులను మోసగించిన కరస్పాండెంట్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318(4) కింద క్రిమినల్ చీటింగ్ కేసు నమోదు చేయాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌ను కలిసి, హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ (కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్) దాఖలు చేస్తామని హెచ్చరించారు.

# వికారాబాద్ జిల్లా ఆసుపత్రి దుస్థితి:

# పరికరాలు లేక ప్రైవేట్, హైదరాబాద్ ఆసుపత్రులకు రోగుల రిఫర్!

**సీఎం జిల్లా, స్పీకర్ ప్రాతినిధ్యంలోనూ తప్పని వైద్య తిప్పలు**

**అనంతగిరి వద్ద ప్రైవేట్ బస్సు బోల్తా: ఐదుగురు మృతి, 40 మందికి తీవ్ర గాయాలు**

**వైద్యం అందక ప్రైవేట్‌కు తరలింపుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

**మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 1 లక్ష ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం**



**వికారాబాద్ (లోకల్ గైడ్, బ్యూరో ప్రతినిధి):** వికారాబాద్ జిల్లా కేంద్రాస్పత్రి కేవలం రోగులకు దిశా-నిర్దేశం చేసే మార్గదర్శక కేంద్రంగా మాత్రమే మిగిలిపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం వచ్చే క్షతగాత్రులకు, తీవ్ర అస్వస్థతకు గురైన బాధితులకు తగిన చికిత్స అందించడంలో ఆసుపత్రి యంత్రాంగం, వైద్య సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు. ఆసుపత్రిలో అత్యంత కీలకమైన ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో, క్షతగాత్రులను ఇక్కడి నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు లేదా హైదరాబాద్‌కు రిఫర్ చేస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు.ప్రముఖుల ప్రాతినిధ్యంలోనూ ఈ దుస్థితారాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గాల్లో వికారాబాద్ ఒకటి. ఒకవైపు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడం, మరోవైపు స్థానిక శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అసెంబ్లీ స్పీకర్ హోదాలో ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యం నామమాత్రంగా మారడంపై ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంతమంది ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సదుపాయాలు, అవసరమైన పరికరాలు లేకపోవడం శోచనీయమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రైవేట్‌కు తరలిస్తూ జేబులు ఖాళీ చేస్తున్నారు!అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జిల్లా ఆసుపత్రికి వస్తే.. పరికరాలు పని చేయడం లేదని, నిపుణులైన వైద్యులు లేరని నెపాలు చెబుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతున్నారని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆపద సమయంలో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు లక్షల రూపాయల అప్పుల పాలవుతున్నారని ఆరోపిస్తున్నారు.అనంతగిరి ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం: 5 గురు దుర్మరణం, 40 మందికి గాయాలుధారూర్ మండలం చింతకుంట గ్రామంలో జరుగుతున్న అంత్యక్రియలకు హాజరయ్యేందుకు కొంతమంది ప్రయాణికులు ప్రైవేట్ బస్సులో బయలుదేరారు. మార్గమధ్యలో అనంతగిరి ఘాట్ రోడ్డులోని ఒక మలుపు వద్ద బస్సు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో 40 మంది తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ సరైన వైద్య పరికరాలు మరియు అత్యవసర చికిత్స విభాగాలు అందుబాటులో లేకపోవడంతో, గాయపడిన వారిని ప్రైవేట్ ఆసుపత్రులకు మరియు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వచ్చింది.మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతివికారాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘోర బస్సు ప్రమాదంపై తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సమాచార సాంకేతిక తథా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.ప్రభుత్వం తరపున భారీ ఆర్థిక సాయం ప్రకటన:మృతుల కుటుంబాలకు: ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని మంత్రి ప్రకటించారు. క్షతగాత్రులకు: తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ. 1 లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు:ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్యారోగ్య శాఖ అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. బాధితులకు తక్షణమే అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను పురమాయించారు.డ్రైవర్ కోసం ముమ్మర గాలింపు:ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలం నుంచి పరారైన బస్సు డ్రైవర్ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన మంత్రి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు.



## రోడ్ డివైడర్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, ( లోకల్ గైడ్ ): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హోమ్స్ కాలనీ నుంచి గాంధీనగర్ చౌరస్తా వరకు చేపట్టనున్న రోడ్ డివైడర్ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారి భద్రత, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఈ రోడ్ డివైడర్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, పలువురు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఏఐ ఆధారిత మధుమేహ అంచనాపై పరిశోధనకు డాక్టర్ సంతోష్ కుమార్ బెజుగంకు పీహెచ్.డీ.

-98.98 శాతం కచ్చితత్వంతో స్కిన్ నెట్ వర్క్ అభివృద్ధి

- గీతం యూనివర్సిటీ అధ్యాపకుడి ఘనత



పటాన్ చేరు, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హైదరాబాద్ లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం అధ్యాపకుడు సంతోష్ కుమార్ బెజుగం డాక్టరేట్ పట్టాకు అర్హత సాధించారు. 'రోగ నిర్ధారణ సహాయం కోసం హైబ్రిడ్ డీప్ ఎన్సెంబుల్ నెట్ వర్క్ ను ఉపయోగించి మధుమేహ అంచనా' అనే అంశంపై ఆయన పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని ఆయన పరిశోధనకు మార్గదర్శకుడిగా వ్యవహరించిన గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్, ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. జ్యోతి శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ పరిశోధన ముందస్తు మధుమేహ ప్రమాద అంచనా కోసం ఒక తెలివైన, విశ్వసనీయమైన ఫ్రేమ్ వర్క్ ను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా రోగ నిర్ధారణలోని సంక్లిష్ట నమూనాలను సంగ్రహించడానికి పరిపూరక అభ్యాస విధానాలను ఏకీకృతం చేసే అత్యాధునిక సీరియల్ కాస్కేడెడ్ కన్వల్యూషనల్ ఎన్సెంబుల్ నెట్ వర్క్ (స్కిన్) ను రూపొందించారు. ప్రతిపాదిత ఫ్రేమ్ వర్క్ సుమారు 98.98 శాతం ప్రయోగాత్మక అంచనా కచ్చితత్వాన్ని సాధించిందని, ఇది ముందస్తు ప్రమాద గుర్తింపు, ఏఐ ఆధారిత రోగ నిర్ధారణ కోసం దాని సామర్థ్యాన్ని తెలియజేస్తోందని తెలిపారు. ఈ పరిశోధన క్లినికల్ నిర్ణయ మద్దతు, ధరించగలిగే ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలు, స్మార్ట్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలో భవిష్యత్ వినియోగానికి ఆశాజనకమైన పునాదిని అందిస్తుందని, మరింత వ్యక్తిగతీకరించిన, అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణకు దోహదపడుతుందని వివరించారు. డాక్టర్ సంతోష్ కుమార్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ.పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.ఎం. ప్రశాంత్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## దేశానికి ఇద్దరు మహనీయుల ఆదర్శాలు స్ఫూర్తిదాయకం

-ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

-సత్యం, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా ఇద్దరు నేతలు..బలరాం యాదవ్



శేరిలింగంపల్లి, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఇద్దరు మహనీయులు, జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్‌లలో ఘనంగా నిర్వహించారు. గాంధీ, శాస్త్రి ఫోటోలు శ్రీరామ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఇరువురి చిత్రపటాలకు నాయకులు, కాలనీవాసులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికీ ప్రపంచానికి ఆదర్శమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగం, అనుసరించిన సత్యాగ్రహ విధానం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని పేర్కొన్నారు. అలాగే నిరాడంబరత, నిజాయితీకి మారుపేరైన లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. జై జవాన్ జై కిసాన్ నినాదంతో రైతులకు, సైనికులకు ఆత్మస్థైర్యాన్ని నింపిన గొప్ప నాయకుడని కొనియాడారు. 1965 యుద్ధ సమయంలో దేశాన్ని సమర్థవంతంగా నడిపించి, హరిత, శ్వేత విప్లవాలకు పునాది వేశారని గుర్తు చేశారు. ఇద్దరు మహనీయుల జీవితాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజమౌళి రావు, సోమయ్య, వెంకటేశ్వర్లు, దామోదర్ రావు, వెంకటయ్య, నగేష్, మాలకొండయ్య, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ఈరన్న, మహమ్మద్, నాగరాజు, అశోక్, కేదార్, సాయి, సత్యనారాయణ, ప్రేమ్, సాయి చరణ్, బిట్టు, తరుణ్, తిరుమల, కాలనీవాసులు, తదితరులు పెద్ద ఎత్తున హాజరై మహనీయులకు ఘన నివాళులు అర్పించారు.

## ఘనంగా బలరామ జయంతి ఉత్సవాలు



నారాయణపేట అక్టోబర్ 3: నారాయణపేట జిల్లా శాంతినగర్, బ్రహ్మన్ వాడి హనుమాన్ మందిరంలో బి కే ఎస్ నగర ఉపాధ్యక్షుడు టంగ విశ్వనాథ్ రెడ్డి భగవాన్ బలరామ జయంతి నిర్వహించారు. బలరాముని చిత్రపటానికి పూజ నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి రైతు దినోత్సవం ఈ కార్యక్రమంలో బి కే ఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ మాట్లాడుతూ మన వేద శాస్త్రంలో “”మాత భూమి పుత్రోహశీ ప్రతిహ్యా “ అని ఉంది పృథ్వి / భూమాత నా తల్లి నేను ఆమె పుత్రుడను. ఈ వాక్యము ఈ భూమిపైన ఉన్న ప్రతి ఒక్కరికి వర్తిస్తుంది నాగలి దున్నే టప్పుడు కానీ ఏ పనికైనా భూమాతను అస్థిరపరిచే ముందు ఆమెకు పూజ చేసి ముఖ్య క్షమించమని అడిగి పని ప్రారంభిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి మాట్లాడుతూ భగవాన్ బలరాముడునీ ఆదర్శంగా చేసుకొని రైతాంగం దినోత్స వం జరుపుకోవడం జరిగిన సందర్భంగా భారతీయ కిసాన్ సాంగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతాంగ సంఘటితంగా రాజకీయానికి అతీతంగా గ్రామ ఆర్థిక అభివృద్ధి,విద్యుత్తు సమస్యలు మార్కెటింగ్ సమస్యలు వరి కొనుగోలు అవకతవకలు, రెవెన్యూ సమస్యల కోసం నిరంతరం బి కే ఎస్ పోరాడుతుందని అన్నారు.ఏవన్నా సమస్య లు ఉన్నా మనం సంఘటితంగా మన సమస్యలు పరిష్కరించ దానికి మనమే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలి ప్రతి నెలలో సమావేశమై రైతాంగ సమస్యలపై అవగాహన పెంచుకోవాలి ఎల్లిన్నోవా ప్రభావం వల్ల కరువు ప్రాంతం ప్రకటించి నష్టప రిహారం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఫిర్యాదు చేయాలి అని తెలిపారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు ఆదర్శ రైతు కాకర్ల భీమయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరము బలరాముని పూజలో పాల్గొంటు అవకాశం కలిగినందున కృతజ్ఞతలు తెలిపారు. తంగ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమానికి అత్యధికంగా రైతాంగం వచ్చిన రైతులకు ధన్యవా దాలు తెలిపారు.ఈ కార్య క్రమంలో నగర అధ్యక్షులు ఆకుల వెంకటప్ప జిల్లా ఉపాధ్యక్షుడు శాసమల బాలప్ప, గుండుల వెంకటప్ప గుండూల బాలప్ప నగర మాజీ ఉపాధ్యక్షుడు జంగిటి శీను పోలేమని వెంకటేశు పోలేమని భీమప్ప జంగిటి నారాయణ, పటేల్ రఘు, శరణప్ప కోస్గి వెంకట్ రెడ్డి జంగిడి వెంకటేష్, కోనంగి వెంకటరెడ్డి, అంజన్న యాదవ్, పూజారి నారాయణ,మహిళా సంఘం సభ్యురాలు తదితరులు అత్యధికంగా కార్యక్రమంలోపాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

దిశ సమావేశంలో ఎంపీ డీకే అరుణ.



నారాయణపేట అక్టోబర్ 3: రైతులు, మహిళలు, విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల పై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజ నాలు అందేలా అధికారు లు సమన్వయంతో పని చేయాలని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డీకే అరుణ సూచించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ కమిటీ సమావేశానికి ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధు లతో,కేంద్ర ప్రభుత్వ నిధుల తో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భం గా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను సాధించే విధంగా అధికా రులు బాధ్యతతో పనిచే యాలని సూచించారు. పథకాల అమలును క్షేత్రస్థాయి వరకు పకడ్బందీగా తీసుకెళ్లడంతో పాటు నిర్ణీత గడువులో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా తదుపరి అభివృద్ధి కార్య క్రమాలకు అనుమతులు, అదనపు నిధులు పొందేం దుకు అవకాశం ఉంటుం దని తెలిపారు. జిల్లా అభి వృద్ధిలో అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.వ్యవసాయ రంగంలో ప్రధానమంత్రి పీఎండీకేవై కార్యక్రమం కింద నారాయణపేట జిల్లాకు ప్రథమ స్థాయి అవార్డు లభించడం అభినందనీయమని పేర్కొంటూ, ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగాన్ని ఎంపీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలపాలని ఆకాంక్షించారు.నారాయణపేట ఆస్పిరేషనల్ జిల్లాగా కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల ప్రారంభ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని సమన్వయంతో కొనసాగించాలని సూచించారు.సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకట్ రాములు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన, కొనసాగుతున్న పనుల వివరాలను వివరించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన రహదారి పనులపై ఈఈ అశోక్ వివరాలు సమర్పించారు.ఆస్పిరేషనల్ బ్లాక్ నర్వ మండలంలో సూచికల ఆధారంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయకర్త బాలాజీ వివరించారు. నర్వ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల అవసరాన్ని ఎంపీ దృష్టికి తీసుకురాగా, దీనిపై అవసరమైన చర్యలు పరిశీలించాలని సూచించారు.భారత్‌మాల ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులపై ఎంపీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 600 ఎకరాల్లో 1,500 మంది రైతులు ఉండగా, సుమారు 150 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీవో రమేష్ తెలిపారు. రూ.217 కోట్ల నష్టపరిహారానికి గాను రూ.184 కోట్లు చెల్లించినట్లు వివరించారు.నష్టపరిహారం రేటు తక్కువగా ఉందన్న కారణంతో కొందరు రైతులు పరిహారం స్వీకరించలేదని తెలిపారు. సేకరించిన భూమికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం తప్పనిసరిగా చెల్లిస్తున్నట్లు జాతీయ రహదారుల శాఖ అధికారి వివరించారు.భూసేకరణలో ఉన్న సమస్యలను పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాలని, రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు.ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 151 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని విద్యుత్ శాఖ ఎస్ఈ నవీన్ తెలిపారు. వీటిలో 49 సర్వీసులు విడుదల కాగా, 162.32 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. సర్వీసులు పొందిన 49 మంది లబ్ధిదారులు సబ్సిడీకి అర్హత పొందినట్లు తెలిపారు.పీఎం-కుసుమ్ పథకం కింద 24 ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించగా, వాటిలో 3 ప్రాజెక్టులకు అనుమతులు లభించినట్లు వివరించారు. గిరిజన తండాల్లో అన్ని నివాసాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయా అనే అంశంపై ఎంపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఇళ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించి మొత్తం 15 పనుల్లో 7 పనులు పూర్తయ్యాయని, 8 పనులు పురోగతిలో ఉన్నాయని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. ఫేజ్-1లోని 15 పనుల్లో 8 పనులు పూర్తయ్యాయని, ఒక పని ప్రారంభం కావాల్సి ఉందని, త్వరలోనే ఆ పనిని ప్రారంభిస్తామని వివరించారు.జిల్లాలో మైనింగ్ ద్వారా సమకూరుతున్న ఆదాయం, ఇసుక రవాణాకు ఇస్తున్న అనుమతులపై ఎంపీ వివరాలు కోరారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొంటూ, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు.ఉట్కూర్ మండలం వల్లంపల్లి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని పీఆర్ఈఈ అశోక్‌ను ఎంపీ ఆదేశించారు. నారాయణపేట--మక్తల్ రోడ్డు పనుల ప్రారంభంపై కమిటీ సభ్యులు అడగగా, పనులు ప్రారంభమయ్యే వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆర్అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్యను ఆదేశిం చారు.ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద జిల్లాలో నిర్మిస్తున్న, నిర్మించాల్సిన రహదారుల వివరాలను పీఆర్ఈఈ అశోక్ వివరించారు.జిల్లాలో అటవీ శాఖ పరిధిలోని నర్సరీలు, నాటిన మొక్కల వివరాలను అటవీ శాఖ అధికారి వివరించారు. తిరుమలపూర్ వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులపై పరిశీ లించాలని ఎంపీ సూచిం చారు.నారాయణపేట మున్సిపాలిటీలో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఆసుపత్రిలో 6,500 ఇన్‌పేషెంట్ కేసులు నమోదయ్యాయని, అక్టోబ ర్ నుంచి ఇప్పటివరకు సుమారు 4,000 శస్త్రచి కిత్సలు నిర్వహించి నట్లు తెలిపారు.సాంకేతిక, సాంకేతికేతర విభాగాల్లో 34 కేటగిరీలకు సంబంధిం చి 154 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని వివరించారు.న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్‌లో భాగంగా జిల్లా లో ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా వయోజన విద్య ఇన్‌చార్జి శ్రీనివాస్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులుసమకూరుస్తున్నాయని వివరించారు.2025--26 సంవత్సరానికి రూ.4,02,632 నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మార్చి 29న నిర్వహించిన ఎఫ్ ఎల్ ఎన్ ఎ టి పరీక్షకు 18,062 మందిని నమోదు చేయగా, 8,172 మంది ఉత్తీర్ణుల య్యారని వివరించారు. సెప్టెంబర్ 27న నిర్వహించి న రెండో దశ పరీక్షకు 24, 665 మందిని లక్ష్యంగా నిర్దేశించగా, 17,800 మంది హాజరైనట్లు తెలిపా రు.జిల్లాలో అక్షరాస్యత రేటు 49.93 శాతం, మహిళల అక్షరాస్యత రేటు 39.72 శాతంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలో నిరక్షరాస్యతను తగ్గించేం దుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సమగ్ర కార్యా చరణతో ముందుకు సాగు తున్నట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా పంచాయతీ,వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, గృహ నిర్మాణ,పంచాయతీ రాజ్,విద్యా శాఖ, డీ డబ్ల్యు ఓ, ఎస్సీ అభివృద్ధి, ఆర్ డబ్లు ఎస్, పౌర సరఫరాల శాఖ, నాబార్డు, మైనింగ్ శాఖ, పశు సంవర్ధక, మత్స్యశాఖ, భూగర్భ జల వనరుల శాఖ, చీఫ్ ప్లానింగ్, ఉద్యాన శాఖ, ఇరిగేషన్, కార్మిక శాఖ, నేషనల్ హైవే,ఆర్‌డబి శాఖల ద్వారా చేపట్టిన పనుల గురించి ఆయా శాఖల అధికారులు క్లుప్తంగా వివరించారు.

## 94వ రోజు కొనసాగిన లయన్స్ క్లబ్ 'అన్నదానం'



నారాయణపేట అక్టోబర్ 3: మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో లయ న్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట్ల ఆధ్వర్యంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న విల్స్ అండ్ మిల్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అన్నదానము కార్యక్రమ ము శనివారం నాటికి 94 వ రోజు కు చేరుకుంది. లైన్స్ క్లబ్ అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో కొనసాగింతోంది.లయన్ వినోద్ పాటిల్ వారి తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం స్పాన్సర్ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సత్యనారాయణ చౌరస్తా లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ సమా జంలో అవసర మైన వారికి అండగా నిలవడం, సామా జిక బాధ్యత గా భావి స్తూ,లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్య క్రమాలు కొన సాగిస్తున్నామని తెలి పారు.ఈ కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ శ్రీనివాస్ లాహోటి,కన్నా జగదీష్, పుత్పాక్ రమేష్, డాక్టర్ సచిన్ , కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని అభినందించిన లైన్స్ క్లబ్ సభ్యులు



నారాయణపేట అక్టోబర్ 3: నారాయణపేట జిల్లా ఎస్పీగా డాక్టర్ వినీత్ ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు.కాగా హరినాయన భట్టడ్ ఏకగ్రీవంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఎస్పి వినీత్ అభినందించారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కార్యక్రమం నేటితో 94 వ రోజుకు చేరిందని వంద రోజుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎస్పి వినీత్ ను లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ కోరారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణ సామర్థ్యం పెంపొందించేందుకే వీక్లీ పరేడ్

ఆర్ ఐ విజయ్ భాస్కర్



నారాయణపేట అక్టోబర్ 3: పోలీసుల్లో క్రమ శిక్షణ,శారీరక దారుఢ్యం,విధి నిర్వహణలో సామర్థ్యం పెంచేందుకు వీక్లీ పెరేడ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ ఐ విజయ భాస్కర్ అన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్‌ఆదేశాల మేరకుశనివారం నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదా నంలో పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్‌ను ఆర్ ఐ విజయ్ భాస్కర్ ఆధ్వర్యం లో నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పరేడ్‌లో భాగంగా మార్చ్‌పాస్ట్, డ్రిల్, శారీరక వ్యాయామాలు నిర్వహిం చారు.ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి సిబ్బందికి క్రమశిక్షణ, దేహదారుఢ్యం, సమయ పాలన ఎంతో ముఖ్యమని తెలిపారు. వీక్లీ పరేడ్ ద్వారా సిబ్బందిలో శారీరక సామర్థ్యంతో పాటు మాన సిక దృఢత్వం, సమన్వ యం, క్రమశిక్షణ పెంపొందు తాయని పేర్కొన్నారు.ఈ పరేడ్ వల్ల పోలీస్ సిబ్బంది నిరంతరం ఫిట్‌గా ఉండటంతో పాటు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులపై ఉన్న బాధ్యతను గుర్తించి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు.అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్సై లు శివ శంకర్, శిరీష, ఏఆర్ మరియు సివిల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేట జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట అక్టోబర్ 3 : శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు “30 పోలీస్ ఆక్ట్” అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అక్టోబర్ 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారు ల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావే శాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్ర మాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నా హాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకు లపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగిం చేందుకు దారి తీసే సమా వేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధ మని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవస రమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలి పారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధ నలు తప్పనిసరిగా అంద రూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## వివో ఏను కులం పేరుతో దూషించి దాడి చేసిన దుండగను కఠినంగా శిక్షించాలి.

జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్. : వివో ఏను కులం పేరుతో దూషించి దాడి చేసిన మాజీ సర్పంచ్ భర్త కుప్పల అమర్నాథ్ ను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఐకెపి వివోఏల సంఘం (సిఐటియు) నల్గొండ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య పొడిచేటి సులోచన లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పి కె మల్లేపల్లి లో ఐకెపి వివో ఏ గా పనిచేస్తున్న గనిపెల్లి మాధవి ని గ్రామ సభలో ప్రజలందరి సమక్షంలో కులం పేరుతో దూషించి దాడి చేసిన మాజీ సర్పంచ్ భర్త కుప్పల అమర్నాథ్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా సంఘ బంధం రుణాలు తీసుకొని కట్టమని అడిగినందుకు ఆమెను కొంతమందివేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు.గత కొంతకాలంగా వివో ఏను టార్గెట్ గా చేసుకొని అన్యాయంగా అధికారులకు కంప్లైంట్ చేయడం ఆమె పేరు ఆన్లైన్లో నుంచి తొలగించడం జరిగిందని దానిపై కోర్టు తీర్పు వచ్చిన నియమాకం చేయకుండా గ్రామ సభలో న్యాయం చేయాలని మాట్లాడుతున్న వివో ఏ గనిపల్లి మాధవి దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికైనా మాధవికి న్యాయం చేయాలని వివో ఏ ల మీద జరుగుతున్న దాడులు వేధింపులు అరికట్టాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు ఎడవెల్లి పాపయ్య, ఆదిరాల లక్ష్మీ , జిల్లా సునీత, డి రజిత వెంకటమ్మ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక



## మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన

-బీఆర్ఎస్ నాయకులు..పార్ నంది శ్రీకాంత్

-గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి..శ్రీకాంత్



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పార్ నంది శ్రీకాంత్ ఘన నివాళులు అర్పించారు. పీజీఆర్ స్టేడియం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్ నంది శ్రీకాంత్ మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి అనే విలువలను జీవితాంతం ఆచరించి దేశానికి స్వాతంత్ర్య స్ఫూర్తిని అందించిన మహాత్మా గాంధీ జీవితం మనందరికీ మార్గదర్శకమని అన్నారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొంతి చిన్న ముదిరాజ్, ముజాహిద్, మల్లేష్ యాదవ్, ప్రతాప్ రజక్, అప్సర్, కృష్ణ, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు

-అర్పించిన కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు, ప్రీతమ్

-గాంధీజీ సత్యం, శాస్త్రీజీ నిస్వార్థ సేవ నేటి తరానికి ఆదర్శం..మిరియాల ప్రీతమ్



శేరిలింగంపల్లి, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గం నేటికీ యావత్ ప్రపంచానికి ఆదర్శమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పాత్రను ఎవరూ మరువలేరని తెలిపారు. అదేవిధంగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు మరువలేనివని, "జై జవాన్ జై కిసాన్" నినాదంతో రైతులు, సైనికులకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత ఎంతో గొప్పదని కొనియాడారు. నిజాయితీ, నిరాడంబరతకు శాస్త్రీజీ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఇద్దరు మహనీయుల ఆశయాలను కొనసాగించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని, వారి బాటలో నడుస్తూ ప్రజాసేవలో ముందుంటామని మిరియాల ప్రీతమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి కరకట్టను ఇసుక తవ్వకాల నుంచి కాపాడాలి

ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు



**చర్ల, లోకల్ గైడ్ :** గోదావరి కరకట్టను ఇసుక తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకలు, కాంట్రాక్టర్ల కార్యకలాపాల వల్ల బలహీనపడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు తెలంగాణ ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖను డిమాండ్ చేశారు. చర్ల మండల ప్రజలను గోదావరి వరదలు, సీతారామ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ముంపు ప్రభావం నుంచి రక్షించేందుకు నిర్మించిన కరకట్టను పటిష్టంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరకట్ట పరిసర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకలపై అధికారులు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. కరకట్టకు నష్టం వాటిల్లితే గ్రామాలు, వ్యవసాయ భూములు, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముంపు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కాబట్టి కాంట్రాక్టర్ల ఆర్థిక ప్రయోజనాల కంటే ప్రజల భద్రత, గ్రామాల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కరకట్ట పటిష్టతపై ఇరిగేషన్ శాఖ సాంకేతిక పరిశీలన నిర్వహించాలని, సీతారామ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరకట్ట పరిధిలో జరుగుతున్న ఇసుక కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసి, చర్ల మండల ప్రజలకు భవిష్యత్‌లో ముంపు, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని ఇరప. రాజు డిమాండ్ చేశారు. కరకట్ట రక్షణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ప్రయోజనాల కోసం ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాటి భూపతిదొర, సోడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ నం.2 స్కూల్‌లో నిర్లక్ష్యం

- ఒకే రోజు ఐదుగురు ఉపాధ్యాయుల గైర్హాజరు.
- సిలబస్ పూర్తికాకుండానే ఎస్ఏ-1 పరీక్షలు
- తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కు విద్యార్థి సంఘా నాయకుల వినతి



**లోకల్ గైడ్/తాండూర్:** తాండూర్ నం.2 ప్రభుత్వ ప్రైమరీ, హైస్కూల్‌లో విద్యార్థుల చదువులు, మౌలిక వసతులపై నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపిస్తూ పిడిఎస్యు, ఐఎఫ్టియు నాయకులు స్థానిక ఎంఈఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు డివిజన్ ఇన్‌చార్జ్ ప్రకాష్, ఐఎఫ్టియు డివిజన్ ఇన్‌చార్జ్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభమైనప్పటికీ కొన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తికాలేదని, ముఖ్యంగా ఫిజిక్స్ బోధనపై నిర్లక్ష్యం ఉందని తెలిపారు. ఒకే రోజు ముగ్గురు నుంచి ఐదుగురు వరకు ఉపాధ్యాయులు గైర్హాజరవుతున్న విషయంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. అలాగే పాఠశాలలో వాష్‌రూమ్‌లు, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలను వెంటనే తనిఖీ చేసి సిలబస్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఒకవేళ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఓపెన్ డ్రైనేజీపై అధికారుల నిర్లక్ష్యం.. మక్తా మహబూబ్ పేట్

-స్మశాన వాటికలో దుర్వాసనతో ప్రజల అవస్థలు

-ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

-బీజేపీ నేత గుండె గణేష్ ముదిరాజ్ విమర్శ



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** మక్తా మహబూబ్ పేట్ 241 డివిజన్ పరిధిలోని స్మశాన వాటికలో ఓపెన్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, మురుగునీరు బహిరంగంగా ప్రవహిస్తూ దుర్వాసన, దోమల బెడదతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోకపోవడం దారుణమని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి శాశ్వత పైపులైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సారా రాము, గంగారం మల్లేష్, గుండె గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి మూడు నియోజకవర్గాలుగా పునర్విభజన

-రాగం నాగేందర్ యాదవ్ కు కలిసొచ్చే అంశం

-సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులు,

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

-సహకారంతో టికెట్ సాధించడమే లక్ష్యం

-ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు..

శేరిలింగంపల్లి ముద్దుబిడ్డకు

-ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ప్రజల డిమాండ్



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** ప్రజల గుండెల్లో నిలిచే నాయకుడు, అభివృద్ధి ప్రదాతగా పేరు తెచ్చుకున్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేరు ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మనసున్న మహారాజుగా ప్రజల మనిషిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం మూడు నియోజకవర్గాలుగా పునర్విభజన కానున్న నేపథ్యంలో ఇది నాగేందర్ యాదవ్ కు మరింత కలిసివచ్చే అంశంగా మారింది. ప్రస్తుతం ఉన్న పెద్ద నియోజకవర్గంలో సేవ చేస్తున్న ఆయనకు కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలలో ఒకదానిలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం ఉందని అనుచరులు భావిస్తున్నారు. ప్రజాసేవలో ముందడుగు, నమ్మకానికి చిరునామా, సేవలో ఆదర్శం, అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన నాగేందర్ యాదవ్ మాట నిలబెట్టే నాయకుడు. ప్రతి కుటుంబానికి ఆత్మీయుడిగా, ప్రజల గుండెల్లో చిరస్థాయి స్థానం సంపాదించారు. వినయమే ఆభరణంగా, యువతకు స్ఫూర్తిగా సంక్షేమానికి సంకల్పంతో ప్రజాహితమే పరమ లక్ష్యంగా పనిచేస్తున్నారు. శేరిలింగంపల్లి ముద్దుబిడ్డ, బీసీల నాయకుడు, జనం మెచ్చిన నాయకుడు, సేవే శ్వాసగా జీవించే నాయకుడు, జనహృదయ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన ఆశయం ఒక్కటే.. ప్రజలకు సేవ చేయడం. అందుకే కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో, సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే టికెట్ సాధించి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేయాలనేది ఆయన ఆశయం. కార్పొరేటర్‌గా చేసిన అభివృద్ధి, సమస్యలకు శీఘ్ర పరిష్కారం చూపే తత్వం, ప్రజల ప్రేమే అసలైన సంపదగా భావించే ఆయనకు ఎమ్మెల్యేగా అన్ని అర్హతలు ఉన్నాయని ప్రజలు కోరుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో టికెట్ సాధించి ఎమ్మెల్యేగా గెలవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి



**నారాయణపేట, అక్టోబర్ 3 :** ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం తగదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని, వేధింపులు, అధిక పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల మొదటి రోజే వేతనాలు చెల్లించాలని, కాలపరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రత, రోగుల సంరక్షణ, సూపర్వైజర్ సేవల కోసం ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐహెచ్ఎఫ్ఎంఎస్) విధానం ద్వారా మూడేళ్ల కాలపరిమితితో ఏజెన్సీలను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. అయితే కాలపరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయకుండా పాత ఏజెన్సీ లకే అనుమతులు పొడిగించడం సరికాదని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరి కారణంగా కార్మికులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అధిక పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. గత నాలుగున్నరేళ్లలో ఆసుపత్రిలో కొత్త భవనాలు, వార్డులు పెరిగినా అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగలేదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు నెల మొదటి రోజే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. కార్మికులపై తప్పుడు ఆరోపణలు, వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీల విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే కార్పొరేషన్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ సీ జిల్లా నాయకులు ఎస్.సంతోష్, ఆసుపత్రి, మెడికల్ కళాశాల బ్రాంచ్ యూనియన్ నాయకులు, కార్మికులు గోవర్ధన్ రెడ్డి, కర్ణాకర్, రాము, వెంకటేష్, రాజు, ఎం.వెంకటేష్, రమేష్, ఖాదర్, రాజలింగం, మధు, శ్రీను, ప్రవీణ్, భీమిరెడ్డి, రాములమ్మ, గోవిందమ్మ, అంబిక, చెన్నమ్మ, ఎం.కవిత, అనురాధ, అనిత, అశ్విని, భూదేవి, సత్యమ్మ, రాధ, శ్వేత, ఆనంద, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## చట్టం అంటే శిక్ష కాదు, రక్షణ

జూనియర్ సివిల్ జడ్జి కె. అవినాష్




**నారాయణపేట అక్టోబర్ 3:** చట్టం అంటే శిక్ష కాదని ప్రజలకు రక్షణ అని నారాయణపేట జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గౌరవ కార్యదర్శి సీనియర్ దివిల్ జడ్జి బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం నారాయణపేట పట్టణంలో స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆదితిగా జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ మాట్లాడుతు విద్యార్థులతో మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు, రాజ్యాంగంలో మనకు 6 హక్కులు ఉన్నాయన్నారు సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, దోపిడీని అరికట్టే హక్కు, మత సామరస్య హక్కు ఉన్నాయని వివరించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా సమాచారం ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైసన్ ఆఫీసర్ కృష్ణయ్య గౌడ్, పాఠశాల ప్రినిసిపాల్ పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ను గెలిపించాలి

ఆర్టీసీ పరిరక్షణకు, కార్మిక సంక్షేమానికి ఎంప్లాయిస్ యూనియన్ గెలుపు అవసరం

- పల్లా నరసింహారెడ్డి




**దేవరకొండ, అక్టోబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్):** ఈ నెల 9న జరగనున్న టీఎస్ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పల్లా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ ఆర్టీసీ డిపో ఎదుట నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థను ప్రైవేటీకరణ నుండి కాపాడుకోవాలన్నా, కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలన్నా ఎంప్లాయిస్ యూనియన్ గెలుపు చాలా అవసరమని అన్నారు. గతంలో కార్మికుల హక్కుల కోసం, ఉద్యోగ భద్రత కోసం ఎంప్లాయిస్ యూనియన్ అనేక పోరాటాలు చేసి విజయం సాధించిందని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, పీఆర్సీ, డీఏ, పదోన్నతులు, బదిలీలు తదితర సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఏకైక యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని స్పష్టం చేశారు. కార్మికులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడేది తమ యూనియనే అని అన్నారు. కావున ప్రతి కార్మికుడు ఆలోచించి, తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎంప్లాయిస్ యూనియన్ కు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికలు ఆర్టీసీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని, కార్మికులందరూ ఏకమై యూనియన్ ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ లు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేవరకొండ ఖిల్లా కోనేరు అధ్వానం

గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో నిండిపోయిన కోనేరు - పర్యాటకులకు తప్పని ఇబ్బందులు



**దేవరకొండ, అక్టోబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్):** నల్లగొండ జిల్లాలో ఎంతో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన దేవరకొండ ఖిల్లా ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఖిల్లా దుర్గంపై ఉన్న ప్రసిద్ధ కోనేరు పూర్తిగా గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో నిండిపోయి కళావిహీనంగా మారింది. నీటిపై పేరుకుపోయిన వ్యర్థాలతో కోనేరు అసలు రూపునే కోల్పోయింది. అంతేకాకుండా ఖిల్లా పైకి వెళ్లే ప్రధాన దారి కూడా పూర్తిగా అధ్వానంగా మారింది. దారి వెంబడి కంప చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో పర్యాటకులు పైకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే పర్యాటకులు నానా అవస్థలు పడుతున్నారు. ఎంతో ఘనమైన చరిత్ర, వారసత్వం కలిగిన దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎటువంటి పనులు జరగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనేరును వెంటనే పూడిక తీసి శుభ్రం చేయాలని, ఖిల్లాకు వెళ్లే దారిని బాగు చేసి పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని స్థానికులు, పర్యాటక ప్రేమికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు

## జాతిపిత జీవితం అనుసరణీయం.. మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

-అమీన్‌పూర్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**అమీన్‌పూర్, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ (ప్రతినిధి కృష్ణ) :** జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని అమీన్‌పూర్ చౌరస్తాలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ అనుసరించిన సత్యం, అహింసా విధానం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. గాంధీజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరి చంద్రకళ గోపాల్, బిజిలి రాజు, కో-ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరి యాదగిరి, దాస్ యాదవ్, చౌటకూరి మహిపాల్ రెడ్డి, కొండకల్ శ్రీనివాస్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈషా హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందించాలి

- అనంతగిరి బస్సు ప్రమాద బాధితులకు ఉచిత మెరుగైన వైద్యం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- క్షతగాత్రులను పరామర్శించిన రాష్ట్ర ఐటీ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబు
- మృతుల కుటుంబాలకు ?5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి ?1 లక్ష ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- ఈషా, మెడిక్యూర్ ఆస్పత్రుల్లో నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యులకు ఆదేశం
- రక్షణ చర్యల్లో పాల్గొన్న స్థానిక యువతకు ప్రత్యేక అభినందనలు



**లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో :** వికారాబాద్ అనంతగిరి గుట్ట సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాద బాధితులకు ఈషా హాస్పిటల్ మరియు మెడిక్యూర్ హాస్పిటల్స్ ప్రత్యేక చొరవతో మెరుగైన ఉచిత వైద్యాన్ని అందిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా ఆస్పత్రితో పాటు ఈషా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర సమాచార సాంకేతిక (ఐటీ ) శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, క్షతగాత్రులకు ఎటువంటి లోటు రాకుండా ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన వైద్యం అందించాలని ఈషా ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఎమ్మెల్యేలు బుయ్యాని మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డితో పాటు డాక్టర్ భరత్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ సుస్మిత రెడ్డి, డాక్టర్ అభినవ్, డాక్టర్ స్మిత ఈషా హాస్పిటల్ యాజమాన్యం రత్నారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రామ్ రెడ్డి ఇషా హాస్పటల్ సిబ్బంది పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

పెద్దపల్లిలో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి బీసీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం



**పెద్దపల్లి: అక్టోబర్, 3 :(లోకల్ గైడ్ ) :** బీసీల హక్కులు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి బీసీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ, బీసీ కార్పొరేషన్‌కు చెందిన దుడిమెట్ల బాలరాజు యాదవ్, దాసరి మనోహర్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల సమస్యలు, వారికి అందాల్సిన హక్కులు, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై నాయకులు చర్చించారు. బీసీల జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. బీసీ వర్గాల సంక్షేమం కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామ స్థాయిలో బీసీ సెల్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. బీసీ వర్గాల సమస్యలపై నిరంతరం ప్రజా ఉద్యమాలు చేపట్టి, వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నాలుగు పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు

వైద్య సేవల నాణ్యతపై ఆరా..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశం




**లోకల్ గైడ్ రంగారెడ్డి, అక్టోబర్ 3:** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి జిల్లాలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరుట్ల, మాడ్గుల, ఇర్విన్, యాచారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన ఆమె అక్కడ అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాహ్య రోగుల, అంతర్గత రోగుల రిజిస్టర్లు, మందుల నిల్వలు, శీతల గొలుసు నిర్వహణ, ప్రయోగశాల సేవలు, సిబ్బంది హాజరు, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు. అలాగే అసాంక్రమిక వ్యాధుల నియంత్రణ, క్షయ వ్యాధి నియంత్రణ, టీకాల కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని డా. స్వర్ణకుమారి సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకులు, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.'

## తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

పెంట తండాలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 3:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విటాయిపల్లి శివారులో ఉన్న పెంట తండా అభివృద్ధికి రూ.75 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు, తండాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పెంట తండాలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని, నిత్య ప్రయాణాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, నాయకులు అలీం, కుమార్ గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## 18 రాష్ట్రాల భాషా నిపుణులతో భద్రాచలంలో కొనసాగుతున్న సెమినార్




భద్రాచలం, లోకల్ గైడ్ : కోయ భాషకు భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో స్థానం కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. భద్రాచలం గిరిజన భవన్‌లో విశ్వ గోండు సమితి ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 6 వరకు నిర్వహిస్తున్న గోండు--కోయ భాషా ప్రామాణీకరణ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భాషా వేత్త మడవి నెహ్రూ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సెమినార్‌కు 18 రాష్ట్రాలకు చెందిన గోండు--కోయ భాషా నిపుణులు, ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లో ప్రాచీన గోండు భాషలో ఉన్న పదాలు, వాటిలో వచ్చిన మార్పులు, వక్రీకరణలను పరిశీలిస్తూ మూలపదాలను సేకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకు 12 సెమినార్ల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 16 వేల పదాలను సేకరించినట్లు, వాటి ఆధారంగా గోండు భాషా డిక్షనరీని రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డా. మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గోండు--కోయ భాషకు రాజ్యాంగపరమైన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోండు భాషకు ప్రాచీన చరిత్ర, మౌఖిక సాహిత్యం, జానపద సంపద, సంస్కృతి, సంప్రదాయాలతో విడదీయరాని సంబంధం ఉందని పేర్కొన్నారు. ఆదివాసీల భాషలు, సంస్కృతి, ఆచారాలు, జీవన విధానాలను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం గోండు--కోయ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు. ఇందుకోసం ఆదివాసీ ప్రజాప్రతినిధులతో టీఏసీ సమావేశం నిర్వహించాలని సూచించారు. గోండు--కోయ భాషలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆదివాసీ విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ నేత రామారావు దొర, తుడుందెబ్బ రాష్ట్ర కోశాధికారి కల్తి రాంప్రసాద్, భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం వరప్రసాద్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు బచ్చల వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా ప్రచార కార్యదర్శి చర్ప అశోక్‌తో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డ్రై డేలో ఆర్మీ మద్యం అక్రమ విక్రయం

29 బాటిళ్లు స్వాధీనం.. ఒకరిపై కేసు నమోదు



**పెద్దపల్లి, అక్టోబర్ 3: (లోకల్ గైడ్ ) :** నిన్న,గాంధీ జయంతి సందర్భంగా అమలులో ఉన్న డ్రై డేను ఉల్లంఘిస్తూ డిఫెన్స్ (ఆర్మీ) మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై పెద్దపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. నమ్మకమైన సమాచారం మేరకు పెద్దకాల్వల ప్రాంతంలో శుక్రవారం అధికారులు దాడులు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జె. రవికుమార్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ (ఐఖీ) ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి. వెంకటేశ్వర్, పెద్దపల్లి స్టేషన్ సిబ్బందితో కలిసి ఈ దాడులు నిర్వహించారు. దాడిలో మొత్తం 29 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ౹ావ్‌వతీ ౹ాఒశీఒ్ట్ర -- 8 బాటిళ్లు, దీశ్రీవఅవతీ'ం౹ాతీఱఅవ -- 10 బాటిళ్లు, ౹ాఱఅస్త్రఱశ్‌బతీవ -- 11 బాటిళ్లు ఉన్నాయి. ప్రతి బాటిల్ 750 మి.లీ. పరిమాణంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మద్యం అక్రమ విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు ఐఖీ ఇన్‌స్పెక్టర్ వి. వెంకటేశ్వర్, పెద్దపల్లి స్టేషన్ ఎస్ఐ దామోదర్ శెట్టి తెలిపారు. అక్రమ మద్యం, గుడుంబా విక్రయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని అధికారులు కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ దామోదర్, హెడ్ కానిస్టేబుళ్లు సందీప్, తిరుపతి, కానిస్టేబుళ్లు డి. సురేష్, బి. నవీన్, పి. నాగరాజు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ల పునర్వ్యవస్థీకరణ.. సంగారెడ్డి, సైబరాబాద్ పరిధుల్లో మార్పులు

-అక్టోబర్ 2 నుంచి కొత్త పరిధుల్లోనే పోలీసు సేవలు..ప్రజలు గమనించాలని విజ్ఞప్తి




**పటాన్ చేరు, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** పోలీస్ స్టేషన్ ల ప్రాదేశిక పరిధుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 85, 88 ప్రకారం పలు గ్రామాలు, కాలనీలు కొత్త పోలీస్ స్టేషన్ ల పరిధిలోకి చేర్చబడ్డాయి. ఈ మార్పులు శుక్రవారం 2026 అక్టోబర్ 02 నుంచి అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు."సంగారెడ్డి జిల్లా-జిన్నారం పరిధిలోకి 11 గ్రామాలు" ఇప్పటివరకు ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన 11 గ్రామాలు ఇకపై జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. అవి: ఖాజిపల్లి, గూడెం, గొల్లగూడెం, గడ్డపోతారం, చెట్లపోతారం, అలీనగర్, కిష్టాయిపల్లి, దాచారం, మాదారం, దువ్వకుంట, మంత్రికుంట. "ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి 11 గ్రామాలు" ఇస్నాపూర్, చిట్కుల్, చిన్న కంజర్ల, ఇంద్రేశం, లక్డారం, పెద్ద కంజర్ల, రుద్రారం, రామేశ్వరం బండ, బచ్చుగూడెం, ఐనోల్, ములుగోయి గ్రామాల ప్రజలకు ఇకపై ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ ద్వారా సేవలు అందుతాయి. "పటాన్ చేరు పరిధిలోకి 7 గ్రామాలు o5 కాలనీలు" సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మండలం పరిధిలోని ముత్తంగి వార్డుకు చెందిన 7 గ్రామాలు గతంలో బీడీఎల్ భానూర్ పరిధిలో ఉండగా, ఇకపై పటాన్‌చెరు పరిధిలోకి వస్తాయి. అవి: ఘన్‌పూర్, వెనుము కుంట, కర్దనూర్, పాటి, వెలిమెల, వెలిమెల తండా, సందుగూడెం. అలాగే రామచంద్రా పురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 5 కాలనీలు కూడా పటాన్‌చెరు పరిధిలోకి చేర్చబడ్డాయి. అవి: బండ్లగూడ, మార్ఫ్ నగర్, భోపాల్ రెడ్డి నగర్, నేతాజీనగర్, బాలాజీ నగర్. "రామచంద్రాపురం, కొల్లూరు పరిధుల మార్పు" బీహెచ్ఈఎల్ న్యూ ఎంఐజీ ఫేజ్-2 (విద్యుత్ నగర్ కాలనీ) కొల్లూరు నుంచి రామచంద్రాపురం పరిధిలోకి చేరింది. సంప్రదించాల్సిన నంబర్లు: రామచంద్రాపురం స్టేషన్ - 8712663199, ఎస్ హెచ్ఓ- 8712663190. ఈదుల నాగులపల్లి గ్రామం బీడీఎల్ భానూర్ నుంచి కొల్లూరు పరిధిలోకి చేరింది. సంప్రదించాల్సిన నంబర్లు: కొల్లూరు స్టేషన్ - 8712663376, ఎస్ హెచ్ ఓ - 8712663370. ఈ ప్రాంతాలకు సంబంధించిన శాంతిభద్రతలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు తదితర సేవలన్నీ ఇకపై కొత్త పోలీస్ స్టేషన్ లనే నిర్వహిస్తాయని పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్, రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ జి.లాలూ నాయక్, కొల్లూరు ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. "పటాన్‌చెరు అసెంబ్లీ పరిధిలో నూతన సీఐలు" జిన్నారం సీఐగా నాగార్జున గౌడ్, గుమ్మడిదల సీఐగా రాఘవేందర్, ఇస్నాపూర్ సీఐగా నిరంజన్ రెడ్డి, భానూర్ సీఐగా అశోక్ గౌడ్ నియమితులయ్యారని, రెండు రోజులలో అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం. ప్రజలు ఈ మార్పును గమనించి తమ పోలీసు అవసరాల కోసం సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు.

## గుండెకు వైద్యం.. మనసుకు ధ్యానం

మానసిక ప్రశాంతత, గుండె ఆరోగ్యంపై 'ది అన్‌చార్టెడ్ ఆర్టరీ -- హార్ట్‌ఫుల్‌నెస్ కంపాస్



**గండిపేట, అక్టోబర్ 3, లోకల్ గైడ్ :** గుండె ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత ప్రాధాన్యతను వివరిస్తూ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ డాక్టర్ ఎ. శరత్ రెడ్డి రచించిన తొలి పుస్తకం 'ది అన్‌చార్టెడ్ ఆర్టరీ -- హార్ట్‌ఫుల్‌నెస్ కంపాస్' శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ బ్లూ ప్లానెట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని పరిచయం చేశారు. మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ పాల్గొని డాక్టర్ శరత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంపత్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్, పద్మభూషణ్ కమలేష్ డి. పటేల్ (దాజీ) ఈ పుస్తకాన్ని సెప్టెంబర్ 28న తెలంగాణలోని కన్హా శాంతి వనంలో ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పుస్తక తొలి ప్రతిని డాక్టర్ శరత్ రెడ్డి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్‌కు అందజేశారు. డాక్టర్ శరత్ రెడ్డి రాసిన వ్యాసాల ఆధారంగా రూపొందిన ఈ పుస్తకంలో మొత్తం 25 వ్యాసాలు ఉన్నాయి. వైద్య విజ్ఞానం, ధ్యాన సాధనను అనుసంధానిస్తూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, పని భారం, అనిశ్చితి, వేగవంతమైన జీవన పరిస్థితుల మధ్య మనసును ప్రశాంతంగా, స్థిరంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఇందులో వివరించారు. శారీరక హృదయ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా వ్యక్తి జీవన నాణ్యతలో కీలక పాత్ర పోషిస్తుందనే అంశాన్ని పుస్తకం ప్రధానంగా ప్రస్తావిస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ, "గుండె చికిత్సల్లో ప్రతి క్షణం విలువైనదే. ఆ సమయంలో చేతులు పనిచేస్తాయి.. కానీ నిర్ణయం తీసుకునేది ప్రశాంతమైన మనసే. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం నా ఆలోచనలో స్పష్టతను, ఒత్తిడిలోనూ నిలకడను పెంచింది. ఆ అనుభవాల నుంచే ఈ పుస్తకంలోని వ్యాసాలు పుట్టాయి. మనం శరీరంలోని గుండె గురించి ఎక్కువగా మాట్లాడతాం. అయితే స్పష్టంగా ఆలోచించడానికి, ప్రశాంతంగా జీవించడానికి మనలోని మరో 'హృదయం'ను కూడా స్థిరంగా ఉంచుకోవాలి. ఆ అంతర్గత ప్రశాంతత గురించే ఈ పుస్తకం," అని తెలిపారు. పుస్తక ఆవిష్కరణకు సహకరించిన మెడికవర్ హాస్పిటల్స్ బృందానికి, హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ దాజీకి డాక్టర్ శరత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత మహిళ మాధవిపై దాడి - చింతపల్లి పీఎస్ ఎదుట ఎమ్మార్పీఎస్ నిరసన

నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి - నల్ల ఆంజనేయులు మాదిగ




**చింతపల్లి, అక్టోబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్):** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీ.కే. మల్లెపల్లి గ్రామంలో గ్రామ సభ సందర్భంగా దళిత మహిళ, వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన దాడిని చింతపల్లి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా శుక్రవారం చింతపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ చింతపల్లి మండల అధ్యక్షులు నల్ల ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ, గ్రామ సభ సందర్భంగా గనిపల్లి మాధవిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటన అత్యంత ఆందోళనకరమని అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా వెలుగులోకి వచ్చిందని, దళిత మహిళపై బహిరంగంగా దాడి చేయడం ప్రజాస్వామ్య సమాజంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. గ్రామ సభలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సి ఉండగా, ఒక మహిళను కుల పరంగా అవమానించడం, దూషించడం, దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత దళిత మహిళకు తక్షణ రక్షణ కల్పించాలని కోరారు. ఇటీవల కాలంలో నల్లగొండ జిల్లాలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా వ్యవహరించాలని అన్నారు. నల్లగొండ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పర్యవేక్షించి, దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వింజమూరి కృష్ణ మాదిగ, వర్మాల సర్పంచ్ కృష్ణయ్య, మాజీ మండల అధ్యక్షులు ఎర్ర వెంకటయ్య, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు సంధ్య యేసు, జిల్లా నాయకులు వింజమూరు రవి, దళిత ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెకంటి యాదయ్య, వార్డు మెంబర్ సైదులు, ఆరెకంటి మురళి మాదిగ, గార్లపాటి వెంకటయ్య, ఏర్పుల దావలయ్య, ఎర్ర కిరణ్, ఎర్ర రాకేష్, ఏర్పుల జంగయ్య, పోలే లాలయ్య, వింజమూరి నరసింహ, కర్నాటి లక్ష్మయ్య, సురేష్, పోలే యాదయ్య తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఒంటరి వికలాంగ మహిళకు 'మీకోసం మేమున్నాం' అండ

వైద్య చికిత్స కోసం రూ.8 వేల ఆర్థిక సాయం అందజేత



**చర్ల, లోకల్ గైడ్ న్యూస్ :** విజయకాలనీకి చెందిన శ్రీమతి కొంగూరు సత్యవతి (62), భర్త దివంగత పిల్లి దాసు, వికలాంగురాలు. సంతానం లేక ఒంటరిగా జీవిస్తూ సదరం పెన్షన్‌తో తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల తీవ్ర కడుపునొప్పి రావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా, గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించి శస్త్రచికిత్స అవసరమని సూచించారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో పాటు తనకు అండగా నిలిచే వారు ఎవరూ లేకపోవడంతో సత్యవతి ఆర్థిక సహాయం కోసం 'మీకోసం మేమున్నాం టీం'ను ఆశ్రయించారు. దీంతో సంస్థ ఆధ్వర్యంలో ఫండ్ రైజింగ్ పోస్టు ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం సేకరించారు. సేకరించిన రూ.8,000 నగదును శుక్రవారం ఉదయం 11.30 గంటలకు 'మీకోసం మేమున్నాం' టీం కార్యాలయంలో సంస్థ కార్యవర్గ సభ్యులు గొట్టిపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా సత్యవతికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు భరోసాగా నిలిచేందుకు 'మీకోసం మేమున్నాం' సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయం అందించడం సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీవీ ప్రతాప్, కవ్వాల రాము, దొడ్డి సూరిబాబు, సింగ సంతోష్, అక్కినేని నెహ్రూ, గుద్దేటి బాలు, దొడ్డి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 6న 'మాదిగ విద్యార్థుల ప్రతినిధుల సదస్సు' విజయవంతం చేద్దాం

- వికారాబాద్ జిల్లా మాదిగ మహిళా సమైక్య పిలుపు
- ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాల మైదానంలో నిర్వహణ
- హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక డ్రెస్ కోడ్ (తెలుపు చొక్కా, నలుపు ప్యాంటు)



**వికారాబాద్, లోకల్ గైడ్ జిల్లా బ్యూరో :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల (అక్టోబర్) 6వ తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాల మైదానంలో "మాదిగ విద్యార్థుల ప్రతినిధుల సదస్సు" నిర్వహించనున్నారు. ఈ సదస్సును జిల్లాలోని విద్యార్థులందరూ హాజరై విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా మాదిగ మహిళా సమైక్య కోరింది. శనివారం వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. ప్రతీ మండలం నుంచి విద్యార్థుల భాగస్వామ్యం:జిల్లాలోని ప్రతీ మండలం నుంచి కనీసం 10 మంది విద్యార్థులు ఈ సదస్సుకు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. సభకు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా ధారణా నియమావళి (డ్రెస్ కోడ్) పాటించాలని, తెలుపు రంగు చొక్కా మరియు నలుపు రంగు ప్యాంటు ధరించి రావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మాదిగ మహిళా సమైక్య తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నపూర్ణ మాదిగ, వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు కేశపల్లి సునీతతో పాటు నాయకులు పద్మా రెడ్డి, లక్ష్మి, యాదమ్మ, నిర్మల, సువర్ణ, సుశీల, లలిత, పుష్పమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అక్రమ వేటపై ఉక్కుపాదం మోపుతాం:

పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ టి. సతీష్ కుమార్



**పెద్దపల్లి, అక్టోబర్ 3: (లోకల్ గైడ్ ) :** వన్యప్రాణులు, అటవీ సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. సతీష్ కుమార్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా పెద్దపల్లి డీఎఫ్ఓ ఆదేశాల మేరకు పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి, మంథని రేంజ్ అటవీ సిబ్బంది, పెద్దపల్లి పోలీసుల సమన్వయంతో పెద్దపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో కార్డన్ సెర్చ్, రైడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వన్యప్రాణులను వేటాడేందుకు ఉపయోగించే వలలు, క్లచ్ వైర్లు, జాలీలు, ఉచ్చులు, కత్తులు, ఇనుప కేజీలు, నైలాన్ తాళ్లు, బైండింగ్ వైర్లు తదితర సామగ్రిని అటవీ అధికారులు సీజ్ చేశారు. అడవుల్లో అక్రమ వేటకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో తనిఖీలు చేపట్టాయి.అనంతరం కుర్మపల్లి గ్రామంలో గ్రామస్తులతో వన్యప్రాణి వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ టి. సతీష్ కుమార్ మాట్లాడుతూ అడవులను నరికివేయడం, వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వన్యప్రాణుల ఆవాసాలను కాపాడటం ద్వారా పర్యావరణ సమతుల్యతను పరిరక్షించవచ్చని చెప్పారు.అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అడవుల్లో ఎవరైనా అక్రమంగా వేటకు పాల్పడినా, వన్యప్రాణులకు హాని కలిగించినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు అటవీ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రమదానంవన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అనంతరం బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. అటవీ సిబ్బంది ఆలయ పరిసరాలను శుభ్రం చేసి, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవులు, వన్యప్రాణులతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ టి. సతీష్ కుమార్, మంథని అటవీ క్షేత్ర అధికారి ఎం. వినయ్ నాయక్, డిప్యూటీ రేంజ్ అధికారులు పి. దేవదాస్, ఎన్. రమేష్, జే. తిరుపతి, జి. కొమురయ్య, సెక్షన్ అధికారులు ఎస్డీ. రహమతుల్లా, ఎం. నరసయ్య, హెచ్. మంగీలాల్, ఎండి. అమిరుద్దీన్, రవి, ముదస్సర్ షా, బీట్ అధికారులు జి. రామ్మూర్తి, ఎస్. మెగరాజ్, పవన్, ప్రదీప్, తిరుపతి, మాధురి, రంజిత్, శ్రీకాంత్, అక్తర్ పాషా, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుపై దేశ వ్యాప్త ఉద్యమానికి సిద్ధం.

**వనపర్తిలో 35 వేలకుపైగా ఓట్లు తొలగింపు.**

**సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామాకు డిమాండ్.**

**సర్ పై అఖిలపక్ష సమావేశంలో నేతల ఆగ్రహం..**




**వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి అక్టోబర్ 3:** ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో సుమారు 2.75 లక్షల మంది ఓటర్లు ఉండగా, 35 వేలకుపైగా ఓట్లను తొలగించారని ఎమ్మెల్యే ఆరోపించారు. మరికొంత మందికి ఓటర్ల కు నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాల్సిన ఎన్నికల సంఘం తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడిందని అఖిలపక్ష నేతలు ఎండీ జబ్బార్ ఆరోపించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని, జాబితాలో జరిగిన మార్పులపై పూర్తి వివరాలను రాజకీయ పార్టీలకు, ప్రజలకు అందుబాటులో ఉంచాలని టీ జే పీ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాషా డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణలో ఎన్నికల సంఘం పూర్తి బాధ్యత వహించాలన్నారు. సర్ అనంతరం జాబితా నుంచి మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి తిరిగి చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఈసీ రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రీ- సర్ జాబితాలో పేరుండి ప్రస్తుత జాబితాలో కనిపించని ఓటర్లతోపాటు తొలిసారి ఓటు హక్కు పొందే యువతను ఈ ప్రక్రియలో చేర్చాలని సీపీ ఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీ ఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని పట్టణ సీపీఐ కార్యదర్శి రమేష్ హెచ్చరించారు . అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. యువతను భాగస్వామ్యం చేస్తూ ఉద్యమాన్ని విస్తరిస్తామని, అవసరమైతే ఢిల్లీలోనూ భారీ ఆందోళన చేపడతామని బీసీ సంఘం నేత బాబు గౌడ్ మండి పడ్డారు. ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులపై పూర్తి పారదర్శకత ఉండాలని ఎంఐఎం నేత రహీమ్ తెలిపారు. సర్ ప్రక్రియలో అభ్యంతరాలు ఉన్న ఓటర్లకు తగిన అవకాశం కల్పించి, వారి పేర్లు తిరిగి పరిశీలించాలని మండ్ల రాజు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనందని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నేతలు ముక్త కంఠంతో చెప్పారు. ఈ సమావేశంలో అఖిలపక్ష వివిధ పార్టీల నాయకులైన డి. కురుమయ్య, గణేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ వైస్ పర్సన్ మాధవి, కోళ్ల వెంకటేష్, బి. కృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా!

**అభివృద్ధి పనులతో ఇబ్బంది కలగనివ్వం..**

**ప్రత్యామ్నాయ దుకాణ సముదాయం ఏర్పాటు చేస్తాం**

**పట్టణ ప్రగతిలో చిరు వ్యాపారులూ భాగస్వాములే: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 3:** పట్టణ అభివృద్ధి పనులతో చిరు వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగనివ్వబోమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. అభివృద్ధి పేరుతో ఏ ఒక్క చిరు వ్యాపారి ఉపాధి కోల్పోకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆమనగల్లు మున్సిపల్ కేంద్రంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.ప్రభుత్వ ఆసుపత్రి పనుల పరిశీలన పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.చిరు వ్యాపారులతో ముఖాముఖిఅనంతరం పట్టణంలోని చిరు వ్యాపారులతో ఎమ్మెల్యే నేరుగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితో కలిసి వ్యాపారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి పనులకు చిరు వ్యాపారులు అడ్డంకి కాదని అన్నారు.అభివృద్ధి పనుల కారణంగా వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారులకు అనువైన ప్రాంతాన్ని గుర్తించి నూతన దుకాణ సముదాయం నిర్మించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రగతికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో, చిరు వ్యాపారుల సంక్షేమానికి కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఎమ్మెల్యే ఇచ్చిన భరోసాపై చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గీత, కౌన్సిలర్లు మహేష్, వెంకటయ్య, కోఆప్షన్ సభ్యుడు అజ్జల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివలింగం, నాయకులు అలీమ్, బాబా, విజయ్, మహేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి!

**ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డా. స్వర్ణకుమారి**

**రికార్డులు పరిశీలించి అధికారులకు కీలక సూచనలు..**

**నూతన సిహెచ్‌సి భవన పనులపై సమీక్ష**



**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 3:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దా. దామోదర రాజనర్సింహ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణకుమారి శనివారం ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, సిబ్బంది పనితీరు, వివిధ రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించిన డీఎంహెచ్ఓ.. డ్రాయింగ్ ఆఫీసర్ మైమున, వైద్యాధికారి ఈశ్వర్, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, పీహెచ్ఎన్, హెడ్‌నర్స్ విమల, ఫార్మసిస్ట్ ఇందిర తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఆసుపత్రిలో నమోదైన విషజ్వరాల కేసులు, రోగులకు అందించిన చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అన్ని రికార్డుల పరిశీలన

ఎఎన్‌సీ, హైరిస్క్, గర్భిణీల పరీక్షలు, ప్రయోగశాల, ఫార్మసీ, టీకాలు, క్షయ, కుష్టు, ఈ—ఆరోగ్యం, అసంక్రమిత వ్యాధులు, ఆన్‌లైన్ సేవలు, హెచ్‌పీవీ టీకాలు, తల్లి-శిశు ఆరోగ్యం, ఓపీ, ఐపీ తదితర రికార్డులను పరిశీలించారు. గర్భిణీలకు సంబంధించిన సేవలు, కుక్కకాటు, పాముకాటు, కోతికాటు వ్యాక్సిన్ నిల్వ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు.గ్రామా కేర్, గర్భిణీల ప్రసవాలు, తల్లి-శిశు ఆరోగ్య సేవలు, ప్రమాదాలకు గురైన వారికి అందించే అత్యవసర వైద్య సేవలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నూతన సీహెచ్‌సీ భవనం త్వరగా అందుబాటులోకి తేవాలిఅనంతరం నూతన సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను డా. మైమున, వైద్య సిబ్బందితో కలిసి డా. స్వర్ణకుమారి పరిశీలించారు. మిగిలిన అసంపూర్తి పనులను వేగంగా పూర్తి చేసి ఒకటి నుంచి రెండు నెలల్లో నూతన సీహెచ్‌సీ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక వైద్య సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలివర్షాకాలం నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విషజ్వరాలతో పాటు శ్వాసకోశ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, ముఖ్యంగా పాముకాటు, కుక్కకాటు, కోతికాటుకు సంబంధించిన మందులు, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు.రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మెడికల్ ఆఫీసర్ డా. మైమున, హెడ్‌నర్స్ విమల, ఫార్మసిస్ట్ ఇందిరా, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాలరెడ్డి, నర్సింగ్ ఆఫీసర్లు దేవేందర్, మధు, రేణుక, వైద్య సిబ్బంది శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబిసిల బారి బహిరంగ సభను విజయ వంతం చేద్దాం..

**జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన సాధనకై సాగుదాం..**

**కోగురి పురుషోత్తం రెడ్డి కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు..**



**లోకల్ గైడ్ న్యూస్ 03 కొందుర్గ్..:** నేడు అనగా ఆదివారం శంషాబాద్ లో జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన సాధనకై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయటం జరిగినది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ జన గణనలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓ బి సి కులాల ప్రత్యేక లెక్కలు తేల్చాలని ,ఆట్టి కుల జనాభాను సైతం పరిగణలోకి తీసుకుని వారి జనాభా అనుకూలంగా ,రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ తో ప్రభుత్వం చేపట్టాలని ,తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఓ బి సి ల విభాగం ప్రత్యేకబారి బహిరంగ సభను శంషాబాద్ పట్టణ పరిధిలోని గొల్లపల్లి రోడ్ పరిసర ప్రాంతంలో ఈ ఆదివారం మధ్యాహ్నం 3 ,30 నిమిషాలకు ఓ బి సి జనాభా హక్కుల సమర బేరీ సభ నిర్వహించబడునని ,ఈ సభకు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పార్టీలో నీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు అన్ని గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, మాజీ వార్డు మెంబర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సింగిల్‌విండో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ సింగిల్‌విండో చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ లు, మాజీ ఎంపీటీసీలు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, రైతులు, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు,ఓ బి సి సెల్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్, కిసాన్ సెల్ నాయకులు, విలేజ్ కమిటీ అధ్యక్షులు, పార్టీ బి ఎల్ ఏ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలోతప్పక హాజరై విజయ వంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు కోగురి పురుషోత్తం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు..

## కామినేని ఆసుపత్రిలో

## పి సి ఎ పి ఎన్ డి టి చట్టం అమలుపై ఆకస్మిక తనిఖీ .

**లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు.**

**డి ఎం హెచ్ ఓ డాక్టర్ కే. రాహుల్.**





**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్. :** నార్కట్పల్లిలోని కామినేని ఆసుపత్రిలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. రాహుల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో పి సి ఏ పి ఎన్ డి టి చట్టం అమలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ విభాగం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు.ఆసుపత్రిలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాల పనితీరు, స్కానింగ్ రికార్డులు, సంబంధిత రిజిస్టర్లు మరియు గర్భిణీలకు నిర్వహించిన పరీక్షల వివరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులతో పి సి ఏ పి ఎన్ డి టి చట్టంలోని నిబంధనలపై సమీక్ష నిర్వహించి, చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, అటువంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డి ఎమ్ హెచ్ ఓ స్పష్టం చేశారు. ప్రతి గర్భిణీకి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం పూర్తిగా నమోదు చేయాలని, నిర్వహించిన అల్ట్రాసౌండ్ పరీక్షల వివరాలను సంబంధిత రికార్డుల్లో మరియు నిర్దేశించిన ఆన్‌లైన్ వ్యవస్థలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో వినియోగిస్తున్న అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు, సి టి స్కాన్ ఎం. ఆర్ ఐ యంత్రాలకు సంబంధించిన చెల్లుబడ్డైన నమోదు/అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, సంబంధిత నిబంధనలను పాటించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు.తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను కూడా డి ఎమ్ హెచ్ ఓ పరిశీలించారు. డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, రికార్డుల నిర్వహణ మరియు కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌తో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ ఆకస్మిక తనిఖీలో డిప్యూటీ డి ఎమ్ హెచ్ ఓ డాక్టర్ కే. నాగేష్, ఆరోగ్య విద్యా విస్తరణ అధికారి శ్రీ పి. అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్

## విద్యానిధి దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పొడిగింపు...

## జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్

**బీసీ, ఈబీసీ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



**పెద్దపల్లి,అక్టోబర్ 03:(లోకల్ గైడ్ ) :** మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం 2026 ఆగస్టు/సెప్టెంబర్ దశకు సంబంధించిన దర ఖాస్తుల సమర్పణ గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30తో ముగియాల్సిన దరఖాస్తుల గడువును అక్టోబర్ 15, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.విదేశాల్లో మాస్టర్స్, డాక్టరల్ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అర్హత కలిగిన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల కలిపి రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలని, దరఖాస్తు సమయంలో అభ్యర్థి వయస్సు 35 సంవత్సరాలు దాటకూడదని తెలిపారు. డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు.అదేవిధంగా +జులో 260 మార్కులు లేదా +ఫాలలో 500 మార్కులు, టీటీలో ఏదో ఒక పరీక్షలో నిర్దేశిత మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. 60 మార్కులు లేదా ×జులో 6.0 బ్యాండ్ లేదా జులో 50 మార్కులు, టీటీలో ఏదో ఒక పరీక్షలో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు.అర్హత కలిగిన విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు విధానం, అర్హతలు, ఇతర పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## జోయాలుక్కాస్ షోరూమ్,బ్రిలియన్స్

## డైమండ్ జ్యువెలరీ షో'తో మెరిసిపోనుంది

**జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎం డి. డాక్టర్ జోయ్ అలుక్కాస్...వెల్లడి**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్(లోకల్ గైడ్ న్యూస్) :వరంగల్, :** జోయాలుక్కాస్,ద వర్ల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్ హనుమకొండ లోని విజయ టాకీస్ ఎదురుగా ఉన్న తమ షోరూమ్‌లో అక్టోబర్ 2, 2026 నుండి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో తెలంగాణను మెరిపించడానికి సిద్ధమైందని తెలిపారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రదర్శన, వజ్రాభరణాలలో నైపుణ్యం, సొగసులు, సరికొత్త ఆవిష్కరణల అపూర్వ వేడుకను అందిస్తుందని అన్నారు. పెళ్లిళ్లకు వాడే అద్భుతమైన నగల సెట్ల నుండి నిత్యం ధరించే ఆధునిక ఆభరణాల వరకు, ఈ షోలో కాలాతీతమైన సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఆభరణాలు లభ్యమవుతాయి అన్నారు. ప్రతి డిజైన్ ఒక కళాఖండం, ఈ షో జరిగే పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు.జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎం డి అయిన డాక్టర్ జోయ్ అలుక్కాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ''బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో అనేది వజ్రాల శాశ్వతమైన ఆకర్షణకు ఆభరణాల రూపకల్పనలో మా పరిపూర్ణతకు నివాళి. తెలంగాణ ప్రజలు ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది అన్నారు, పండుగల సమయంలో జరిగే ఈ ప్రదర్శన వినియోగదారులకు అందం, ప్రత్యేకత, అత్యుత్తమ కళాత్మకతను ప్రతిబింబించే డిజైన్లను కనుగొనడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందని వారు తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రదర్శన సమయంలో 1 లక్ష రూపాయలు, లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికి ఒక ఉచిత బంగారు నాణెం లభిస్తుంది అన్నారు. ఇది షాపింగ్ అనుభవానికి మరింత మెరుపును జోడిస్తుంది అన్నారు.అత్యంత ప్రత్యేకంగా నిర్వహించబడుతున్న 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ విజయ టాకీస్ ఎదురుగా ఉన్న షోరూమ్‌లో 2026 అక్టోబర్ 18 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. సందర్శకులను వజ్రాల అద్భుతమైన ప్రపంచాన్ని అన్వేషించడానికి ఆహ్వానిస్తున్నాము అని తెలియజేశారు.

## ఎమ్మెల్యే నాగరాజు పై తప్పుడు

## వార్తలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03(లోకల్ గైడ్ న్యూస్) :** వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పై తప్పుడు వార్తలు ప్రచురించిన ప్రముఖ మీడియా ఛానల్ పై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పై చేసిన తప్పుడు ఆరోపణలను నిరసిస్తూ హన్మకొండ అంబేద్కర్ విగ్రహ సర్కిల్లో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అనంతరం కొంక హరిబాబు మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ఎలాంటి అవినీతి మరకలు అంటకుండా నీతి నిజాయితీతో పేద బడుగు బలహీన వర్గాలకు సేవ చేస్తుండడాన్ని జీర్ణించుకోలేక కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. దళిత ఎమ్మెల్యే పై ప్రముఖ మీడియా సంస్థ తప్పుడు వార్తలు ప్రచురించడం దారుణం అన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్దం శివరాం ప్రసాద్, 55వ డివిజన్ అధ్యక్షుడు గద్దం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: చిలకమర్రి రాంరెడ్డి



## అన్నకు ఎంబీబీఎస్ సీటు, తమ్ముడికి కేంద్రంలో ఉద్యోగం

### సన్మానించిన సర్పంచ్ అభినందించిన గ్రామస్తులు

**లోకల్ గైడ్ కామారెడ్డి ప్రతినిధి :** ఎల్లారెడ్డి, అక్టోబర్ 3: ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండాకు చెందిన సభావత్ రమేష్ పెద్ద కుమారుడికి ఎంబీబీఎస్ సీటు రావడం, చిన్న కుమారుడికి సెంట్రల్ అగ్రికల్చర్ శాఖలో ఉద్యోగం సాధించారు. దింతో శనివారం స్థానిక సర్పంచ్ రతన్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇద్దరు యువకులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్బంగా సర్పంచ్ రతన్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థి అయిన సభావత్ విష్ణు నిజామాబాద్ జిల్లా మేఘన డెంటల్ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని అన్నారు. మరెన్నో ఉన్నత చదువులు చదివి వైద్యుడిగా రాణించి సమాజానికి సేవలందించాలని, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అదేవిధంగా సెంట్రల్ అగ్రికల్చర్ శాఖలో ఉద్యోగం సాధించిన సభావత్ వసంత్ చదువు పట్ల చూపిన శ్రద్ధ, అంకితభావం, కృషి, పట్టుదలే ఈ విజయానికి కారణమని కొనియాడారు. విద్యారంగంలో, ఉద్యోగ రంగంలో రాణించిన వీరిని గ్రామ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, జీపీవో, ఉప సర్పంచ్ శ్రీరాములు, వార్డు మెంబర్లు నరేష్, రవి, తండా వాసులు కిషన్, దేవీసింగ్, మహిపాల్, రమేష్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వయోవృద్ధులు, ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తా

### భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల శ్రేష్ట




**భద్రాచలం, లోకల్ గైడ్ న్యూస్ :** కార్యాలయానికి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తుదారుల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తానని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల శ్రేష్ట తెలిపారు. శనివారం పౌర కేంద్రీకృత పరిపాలనలో భాగంగా తన కార్యాలయం వెలుపల వయోవృద్ధులు, దివ్యాంగుల నుంచి వ్యక్తిగతంగా వినతిపత్రాలను స్వీకరించి, సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం భద్రాచలంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్ 8 నుంచి 10వ తరగతి విద్యార్థినులతో వారి చదువులు, మధ్యాహ్న భోజనం, పాఠశాలలోని సౌకర్యాలపై మాట్లాడారు. విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు అందించారు. 12వ తరగతి అనంతరం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ఐఐటీ-జేఈఈ, నీట్, సీయూఈటీ వంటి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఆన్‌లైన్ వనరులను వినియోగించుకోవడంతో పాటు ఏఐ, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ వంటి ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యాలను నేర్చుకునేందుకు కంప్యూటర్ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం క్రీడల్లో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. తదుపరి బ్రిడ్జ్ పాయింట్ ఆటో స్టాండ్‌ను సందర్శించి ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. వారికి ఉన్న బీమా సదుపాయాలు, సురక్షిత డ్రైవింగ్, పిల్లల విద్య, స్టాండ్ సమీపంలో తాగునీరు, మరుగుదొడ్ల లభ్యతతో పాటు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు




**వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి అక్టోబర్ 3:** సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కృష్ణపక్ష అష్టమి, ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సతీమణి శారదా రెడ్డి, కుమారుడు నవనీత్ రెడ్డితో కలిసి సింగోటంలోని తమ ఇంటి దైవమైన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు వేద బ్రాహ్మణులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు.అనంతరం కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తదుపరి ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులు మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు.స్వామివారి కృపతో వనపర్తి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆకాంక్షించారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

### మహిళలు, తల్లులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### అంగన్వాడీ కార్యకర్తల సూచనలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ సూచన



**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 3:** పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో శనివారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ ప్రతి మహిళ, తల్లి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వచ్చి సూచించే పోషకాహార విధానాలను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని, పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పత్య నాయక్ సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యధికారి మెడికల్ ఆఫీసర్ డా. మైమున, వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి,అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్‌కౌన్సిలర్లు నాగిల్ల జగన్, అనుష--శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు పూసల సత్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఆసుపత్రి సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ అభివృద్ధి కి మరింత కృషి

### ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

### అభివృద్ధి పనులకు రూ.2.88 కోట్లతో శంకుస్థాపన



**శంషాబాద్, అక్టోబర్ 3 లోకల్ గైడ్ :** శంషాబాద్ సర్కిల్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం శంషాబాద్ సర్కిల్ పరిధిలోని కొత్వాల్ గూడ, సంఘీ గూడ లో స్మార్మ్ వాటర్ డ్రైవ్ నిర్మాణ, శంకుస్థాపన అభివృద్ధి పనులకు రూ.2.88 కోట్లతో శంకుస్థాపన పనులకు ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత నిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామీణ ప్రజలకు భరోసానిచ్చే క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం..

### రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రి నిర్మాణం

### రూ. 200 కోట్లకు పైగా నిధులతో క్యాన్సర్ నివారణ, వ్యాక్సినేషన్, ఉచిత సహాయక కార్యక్రమాలు



**ఖమ్మం/సత్తుపల్లి, అక్టోబర్-3: లోకల్ గైడ్:** షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం, సత్తుపల్లి మండలం చివరి గ్రామమైన నారాయణపురంలో రూ. 200 కోట్లకు పైగా అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన క్యాన్సర్ ఆసుపత్రి, వ్యాక్సినేషన్, ఉచిత వైద్య సహాయక కార్యక్రమాల ఏర్పాటుపై రాష్ట్ర రెవెన్యూ , హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తన స్వంత నియోజకవర్గంలో ఈ విధమైన బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల ట్రస్ట్ నిర్వాహకులకు, టీమ్ సభ్యులకు ఆయన మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు, హెచ్ పీవీ టీకాల కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, క్యాన్సర్ అనే మహమ్మారి ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించవచ్చని, అయితే గ్రామీణ ప్రాంత ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల, వైద్య ఖర్చులకు భయపడి ఆలస్యంగా ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన, గిరిజనేతర పేద కుటుంబాలకు ఆసుపత్రి ద్వారా వైద్యంతో పాటు వ్యాక్సినేషన్ ఒక్కొక్కరికి రూ. 7,000 విలువైన అందించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ట్రస్ట్ ముందుకు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు.ఆసుపత్రి పరిసర ప్రాంతాలకు రోడ్డు వసతులు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రతిపాదనలను రోజుల్లోగా తయారు చేసి తనకు పంపించాలని జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలతో వచ్చే ఈ వినతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వెంటనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పెద్ద మనసుతో భూమిని స్వల్ప ధరకు విక్రయించి సహకరించిన స్థానిక గ్రామస్తులను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టుకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వ పరంగా పూర్తి అండదండలు ఉంటాయని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఒకప్పుడు టీవీలలో, ఎక్కడో ఒకరికి వినే క్యాన్సర్ వ్యాధి, నేడు మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల ప్రతీ గ్రామంలోనూ కనిపిస్తూ సర్వసాధారణంగా మారిపోయిందని అన్నారు. క్యాన్సర్ చికిత్స అత్యంత ఖరీదైనది కావడం వల్ల సామాన్యులు భరించలేకపోతున్నారని, ఈ క్రమంలో శ్రీ జనమంగళం ట్రస్ట్ వ్యాధి ముదిరిపోకుండా ప్రివెంటబుల్ క్యాన్సర్ డిసీజ్, ఆర్లీ డిటెక్షన్ (ముందస్తు వ్యాధి నిర్ధారణ) సేవలపై దృష్టి సారించడం విశేషమని తెలిపారు. గ్రామీణ పేదలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేలా ఈ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారని అన్నారు.కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ట్రస్ట్ నిర్వాహకులు రఘునాథరెడ్డి, సతీష్ రెడ్డి ల విజ్ఞప్తి మేరకు నారాయణపురం గ్రామస్తులు ఈ ఆసుపత్రి నిర్మాణానికి ఉదార హృదయంతో భూమిని అందించడం వల్లనే ఈ బృహత్తర కార్యక్రమం సాధ్యమైందని అన్నారు. మారుమూల, గిరిజన ప్రాంతాలైన అశ్వారావుపేట, ములకలపల్లితో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతో మేలు చేస్తుందన్నారు. జీవనశైలి, ఆహార అలవాట్లు, కాలుష్యం కారణంగా ప్రతి పది కుటుంబాల్లో ఒకరికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్న ఈ రోజుల్లో, ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు, ఉచిత వైద్య చికిత్సలు అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, వేలూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే ప్రపంచ స్థాయి ఉచిత వైద్యం అందడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, ఈ ఆసుపత్రి విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, ఐటీడీఏ పీవో బి. రాహుల్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక వైభవానికి అల్లీపురం వేదికగా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం...

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

### 20 ఎకరాల్లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

### ఈ నెల 12న అంగరంగ వైభవంగా భూమి పూజ

### అమరావతిలోని ఆలయ నమూనాలో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణం

### ఖమ్మం ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి ఆలయ నిర్మాణాలు దోహదం

### భూమిపూజ కార్యక్రమానికి భక్తులు, అన్ని సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలి



**ఖమ్మం, అక్టోబర్ -3: లోకల్ గైడ్:** ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా అల్లీపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. భద్రాద్రి రాముడు కొలువైన ఖమ్మం జిల్లాలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.ఖమ్మం నగరంలోని అల్లీపురం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్థలాన్ని శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి కేటాయించిన భూమి విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని అన్నారు. భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ నిర్మాణానికి ఎంతో భక్తి భావంతో ఆమోదం తెలిపారని మంత్రి పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు సహకారంతో ఆలయ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ నెల 12న అంగరంగ వైభవంగా భూమి పూజ:

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఈ నెల 12న అల్లీపురం వద్ద ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అమరావతిలోనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నమూనాలోనే అల్లీపురంలో ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి ఖమ్మం నగరంలోని అన్ని సంఘాలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

ఖమ్మం నగరం నుంచే కాకుండా నల్గొండ, వరంగల్ తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా భూమి పూజ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఖమ్మం:

ఖమ్మం నగరంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆలయం, స్వామి నారాయణ విద్యా సంస్థ, తదితర నిర్మాణాలు జరుగుతున్నా యని మంత్రి తెలిపారు. వీటితో ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందడంతో పాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.పర్యాటక రంగానికి ఉపయోగపడే విధంగా విశాలమైన పార్కింగ్ సౌకర్యంతో హరిత హోటల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు.

భూసేకరణ పూర్తి చేసిన అదనపు కలెక్టర్‌కు అభినందనలు :

ధంసలాపురం ఎగ్జిట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్వామి నారాయణ విద్యా సంస్థలు ఇస్కాన్ ఆలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణను రైతులను ఒప్పించి విజయవంతంగా పూర్తి చేసిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిని మంత్రి అభినందించారు. రైతులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి స్థలాన్ని గుర్తించాలి :

ఖమ్మం నగరానికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. కార్యాలయ నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని గుర్తించి, అవసరమైన స్థల సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నగర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి :

ఖమ్మం నగరంలో చేపడుతున్న రోప్‌వే, కేబుల్ బ్రిడ్జి, మెడికల్ కాలేజీ, మున్నేరు రిటైనింగ్ వాల్, తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయా అభివృద్ధి పనులను ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఖమ్మం నగర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఖమ్మం ప్రాంతంలో గుర్తించిన అక్రమ మైనింగ్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.భూమి పూజకు పటిష్ట ఏర్పాట్లు: మున్సిపల్ కమిషనర్ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పటిష్టంగా చేపడతామని తెలిపారు. స్వామివారి దయతో ఆలయ నిర్మాణ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసి ఖమ్మం నగరానికి తలమానికంగా నిలిచేలా కృషి చేస్తామని అన్నారు.

ఆధ్యాత్మిక ప్రాంగణంగా అల్లీపురం: సుడా చైర్మన్

అల్లీపురం ప్రాంతం మొత్తం శ్రీ వెంకటేశ్వర స్వామి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకునేలా ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 12న నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆలయ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు టీటీడీ చైర్మన్‌తో సమన్వయం చేస్తున్నారని తెలిపారు.

తిరుమల ఆధ్యాత్మిక ప్రతిబింబంగా ఆలయం: రాయల నాగేశ్వరరావు

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మిక ప్రతిబింబించేలా అల్లీపురంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరుగుతుందని తెలిపారు. స్వామి నారాయణ ఆలయం, మెడికల్ కాలేజీ, ఇస్కాన్ ఆలయం, తదితర నిర్మాణాలతో ఖమ్మం జిల్లాను పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా, విద్యాపరంగా, వైద్యపరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక



# జ్యోతిర్వాస్తు విద్యాపీఠం లో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి,నిర్మలా జగ్గారెడ్డి

2700 మంది మహిళలతో సామూహిక వ్రతం




**లోకల్ గైడ్/ సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా ఫసల్వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణ లో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు.అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతం లో పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 7న సేవా జ్యోతి కలశ యాత్ర - సంగారెడ్డి బీజేపీలో సన్నాహక సమావేశం

-సేవా సంకల్ప్ అభియాన్ విజయవంతానికి కృషి చేయాలి..కాసం వెంకటేశ్వర్లు, గోదావరి అంజిరెడ్డి

-కాసం వెంకటేశ్వర్లను సన్మానించిన..కంజర్ల




**పఠాన్ చేరు, అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా అక్టోబర్ 7న నిర్వహించే సేవా జ్యోతి కలశ యాత్ర సన్నాహక కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ కన్వీనర్లు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, శక్తి కేంద్ర, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ కంజర్ల కృష్ణమూర్తి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు.

# నేడు శంషాబాద్ గొల్లపల్లిలో 'ఓబీసీ సింహగర్జనలి

మహాసభ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్

హాజరుకానున్న ఏఐసీసీ, పీసీసీ అగ్రనేతలు, మంత్రులు

భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 03 (లోకల్ గైడ్ ) :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం గొల్లపల్లి వేదికగా ఆదివారం మధ్యాహ్నం 3:00 గంటలకు నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక 'ఓబీసీ సింహగర్జన' మహాసభను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా లిడీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ లిపిలుపునిచ్చారు.దేశంలో సామాజిక సమతుల్యతను, బహుజనుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ సభను ఏర్పాటు చేశారు. పీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సభ ఓబీసీల ఐక్యతకు నిదర్శనంగా నిలవనుందని ఆమె పేర్కొన్నారు. "జిస్కి జిత్ని సంఖ్య - ఉత్ని హిస్సేదారి" (ఎవరి సంఖ్య ఎంతైతే, అంత వాటా) అనే నినాదాన్ని సాకారం చేసేందుకు, రాజ్యాంగబద్ధమైన పదవులలో తగిన రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని గుర్తుచేశారు.ఈ సభకు ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపీసీ ఛైర్మన్ మధు యాస్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఏఐసీసీ కోఆర్డినేటర్ కొప్పుల రాజులతో పాటు తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు హాజరుకానున్నారు.సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని, శంషాబాద్ గడ్డపై నిర్వహించే ఈ మహాసభకు ఓబీసీ సోదరులు, యువకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని మంగమ్మ శివకుమార్ కోరారు.

# శబరిమల మహా పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు ఆహ్వానం



**( లోకల్ గైడ్ షాద్ నగర్ ) :** శ్రీ కలియుగవర్ధన్ శబరిమల మహా పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో వేదగిరి వేద ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ఈ నెల 22-10-2026న లాల్పహాడ్ గ్రామం నుంచి ప్రారంభం కానున్న మహా పాదయాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాదయాత్ర విజయవంతంగా కొనసాగేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు అంజయ్య యాదవ్‌ను కోరారు. భక్తి, ఆధ్యాత్మికత, స్వామివారి నామస్మరణతో చేపట్టనున్న ఈ మహా పాదయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మాజీ పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ పడకంటి వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు కొండి యాదయ్య, పాదయాత్ర ఆర్గనైజర్స్ చితం సురేష్, బాబీ, మల్లేష్, నందు ముదిరాజ్, చంద్రశేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించు

సత్యం , ప్రేమ , శాంతి , సేవాభావాలతో కూడిన నైతిక విలువలను కలిగి ఉండాలి



**ఖమ్మం, అక్టోబర్,3: లోకల్ గైడ్ :** ఖమ్మం వీడియోస్ కాలనీ టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా మరియు టౌన్ అన్ని పాస్టర్స్ ఫెలోషిప్స్ వారి సహకారముతో.... ఆదరణ మినిస్ట్రీస్ ఉత్సవాలు నిర్వహించబడ్డాయి . ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా దైవజనులు బ్రదర్ క్రిష్టి పాల్గొని మాట్లాడారు . దేవుని కుమారుడు మన పాపాలను కడుగుటకై భూమిపై వచ్చి ఉన్నాడని మనిషి కుమారుడుగా జన్మించి శిలువపై తమ రక్తాన్ని చిందించి మన పాపములను శుద్ధి చేసి ఉన్నాడని పేర్కొన్నారు . నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించు , శత్రువులను కూడా క్షమించే గొప్ప హృదయాన్ని కలిగి సేవాభావంతో ఉండాలి , శాంతి మార్గంలో నడవాలని ఏసుప్రభు బోధనలను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు . యువత తమ జీవితాన్ని కేవలం స్వార్థం కోసం కాకుండా పెంచి పోషించిన తల్లిదండ్రుల కొరకు మరియు దేశం కొరకు త్యాగం చేయాలని అలాగే సత్యం , ప్రేమ , శాంతి , సేవాభావాలతో కూడిన నైతిక విలువలను పెంపొందించుకోవాలని అన్నారు . వయసులో ఉన్నప్పుడు వచ్చే రకరకాల ఆకర్షణలు , చెడు అలవాట్లకు దూరంగా ఉండి , నీతివంతమైన పవిత్రమైన జీవితాన్ని గడపాలని కోరారు . ఆదివారం కూడా ఈ సభ కొనసాగుతుందని సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఆహ్వానించువారు పాస్టర్ అభిషేక్ ఆదరణ మినిస్ట్రీస్ ఖమ్మం తెలిపారు .

# అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

స్కానింగ్ మిషన్లు సీజ్ --కేసులు నమోదు

**వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03(లోకల్ గైడ్ న్యూస్) :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాలోని నెక్కొండ, కాశీబుగ్గ ప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పోర్టబుల్ స్కానింగ్ మిషన్లను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. నెక్కొండలోని ఉపేందర్ ఆసుపత్రిలో అనుమతి లేకుండా స్కానింగ్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికరారి డాక్టర్ బి. రాజా రెడ్డి ఆదేశాలతో, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాజిదా, సిబ్బంది ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.తనిఖీలో స్కానింగ్ కేంద్రానికి అవసరమైన రిజిస్ట్రేషన్ లేకుండా, సంబంధిత అర్హతలు లేని డాక్టర్ పార్థు, బి ఎ ఎం ఎస్, ఎం డి, (ఆయుష్) స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించి, స్కానింగ్ మిషన్‌ను సీజ్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.స్కానింగ్ మిషన్‌ను అద్దెకు ఇస్తున్నట్లు గుర్తించిన గణేష్ ,లింగ నిర్ధారణ కోసం కేసులను తీసుకువస్తున్నట్లు గుర్తించిన పద్మను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న స్కానింగ్ మిషన్, మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా



కాశీబుగ్గలోని వివేకానంద కాలనీలో గర్భిణులకు అనుమతి లేకుండా స్కానింగ్ నిర్వహిస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ప్రోగ్రాం అధికారి సయ్యద్ ఇక్తిదార్ అహ్మద్ ,వైద్య సిబ్బంది, ఇంతేజార్‌గంజ్ పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలో రిజిస్ట్రేషన్ లేని ఒక పోర్టబుల్ స్కానింగ్ మిషన్ను గుర్తించారు. చిర్ర మాధవి అనే స్టాఫ్ నర్స్, సంబంధిత అర్హతలు లేకుండానే, తన నివాసంలో తన సమీప బంధువు నిరోషతో కలిసి స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లింగ నిర్ధారణ పరీక్షల కోసం గర్భిణులను తీసుకువస్తున్నట్లు గుర్తించిన నిరోష మరియు గణేష్‌పై కూడా కేసు నమోదు చేశారు. స్కానింగ్ మిషన్‌ను దిలీప్ అనే వ్యక్తి విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. స్కానింగ్ మిషన్‌తో పాటు సంబంధిత వస్తువులను, నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నెక్కొండ మరియు కాశీబుగ్గ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీలలో, లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం ఆడ శిశువు అని తేలిన గర్భిణులను గర్భస్రావం కోసం మహేందర్ అనే ఆర్ ఎం పి, మహబూబాబాద్ వద్దకు, అలాగే నెక్కొండ నుండి డాక్టర్ అంజన్ కుమార్ వద్దకు పంపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.ఈ వ్యవహారాలకు సంబంధించి గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం, 1994 (గ్రాజూచీణు ాావ్) నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, తదుపరి దర్యాప్తును పోలీసులు కొనసాగిస్తున్నారు.జిల్లాలో అనుమతి లేకుండా స్కానింగ్ కేంద్రాలను నిర్వహించడం, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదా వాటికి సహకరించడం చట్టవిరుద్ధమని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి తెలిపారు. ఇటువంటి కార్యకలాపాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ , రెవెన్యూ శాఖల సమన్వయంతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

# నిర్లక్ష్యానికి ఐదుగురు బలి.. ఇకనైనా ప్రభుత్వం మేల్కొనాలి!

బస్సు ప్రమాదంలో బాధితులకు ?

50 లక్షల పరిహారం చెల్లించాలి:

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్

**లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో :** వికారాబాద్ జిల్లా అనంతగిరి సమీపంలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాద స్థలాన్ని బిఆర్ఎస్ పార్టీ స్థానిక మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరిశీలించారు. మానవత్వం చాటుకున్న డాక్టర్ హోదాలో ఉండి ప్రజలకు సేవ చేయాలనే ఒక దృక్పథంతో బస్సు బోల్తా పడిందని




సమాచారంతో పరుగు పరుగున వచ్చి వైద్యం అందించారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందని డాక్టర్ మెతుకు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.మృతుల కుటుంబాలకు ?50 లక్షల ?హారం: ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ?25 లక్షలు, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం తరఫున ?25 లక్షలు కలిపి మొత్తం ?50 లక్షల పరిహారం వెంటనే అందజేయాలి.బాధితులకు ?10 లక్షల సాయం: కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు ?10 లక్షల పరిహారం ప్రకటించాలి.ఉచిత వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలి.వాహనాల ఫిట్‌నెస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలిబస్సు బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాల ఫిట్‌నెస్‌పై యాజమాన్యాలు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ వాహనాలను ఎప్పటికప్పుడు కఠినంగా తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత

పరిశుభ్రత, పౌష్టికాహారం, తాగునీరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

అవసరమైన మరమ్మతులు, సదుపాయాల కోసం అంచనా ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**లోకల్ గైడ్ /సంగారెడ్డి :** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం, సురక్షితమైన తాగునీరు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతుల అవసరాలు, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహారం తయారీ, నిల్వ, పంపిణీలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అలాగే వసతి గృహాల్లో తగిన గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గదిలో అవసరమైన ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తలుపులు, రన్నింగ్ వాటర్ తదితర సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమయ్యే పనులకు సంబంధించి పూర్తి వివరాలతో అంచనా ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ప్రిన్సిపాళ్లు, జిల్లా కోఆర్డినేటర్లను ఆదేశించారు.విద్యార్థులు రాత్రి వేళల్లో కూడా సురక్షితంగా సంచరించేలా రెసిడెన్షియల్ పాఠశాలల క్యాంపస్ పరిసరాల్లో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకునేలా, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ పోరాటంతో రైతుల విజయం



రైతుల గోడు పట్టని ఎమ్మెల్యే రాజీనామా చేయాలి...

బుయ్యారంలో రైతుల సంబరాలు

**బెల్లంపల్లి (లోకల్ గైడ్) :** తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో బుయ్యారం గ్రామంలో రైతుల కళ్లల్లో ఆనందం కలిగింది.అనేక పోరాటాలు చేసి,చివరికి న్యాయ పోరాటంతో రైతులు విజయం సాధించారు.గ్రామంలో వారి భూములను దుక్కి దున్ని బాజా భజంత్రీలతో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో శనివారం వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో రైతుల భూముల్లో దుక్కి దున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు న్యాయ పోరాటంతో రైతులు విజయం సాధించారని,పేద రైతులకు భూములు దక్కేలా చేసిన న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలిపారు.అనేక సంవత్సరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకొని వారిని వేధిస్తు,అక్రమ కేసులు బనాయిస్తు ఆక్రమించుకుంటుంటే స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఎమ్మెల్యే రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని,ఆయన చీరాల బీచ్లో జల్సాలు చేస్తున్నారని అన్నారు.ప్రజల సమస్యలు పట్టించుకోనీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అటవీశాఖ అధికారులు రైతుల భూములు కబ్జా చేస్తే ప్రతి దాడులు చేయడానికి కూడా వెనుకాడరని హెచ్చరించారు.గత యాభై ఏళ్లుగా అనేక మంది రైతులు సాగు చేస్తున్న భూములను అటవీ శాఖ అధికారులు అక్రమంగా ఆక్రమించుకొని వారికి ఉపాధి లేకుండా చేస్తున్నారని అన్నారు.వారికి ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసిందని తెలిపారు.అప్పటి నుండి రైతులు సాగు చేస్తున్నారని,కానీ అటవీశాఖ అధికారులు ఇటీవల జోక్యం చేసుకొని రైతులపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వారిని చేలల్లో వెళ్లకుండా సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని,దీనివల్ల పేద రైతులు కష్టాలు పడుతున్నారని అన్నారు.వారికి అన్ని హక్కులున్నా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం శోచనీయం అన్నారు.అటవీశాఖ అధికారులు రైతుల జోలికి పోవద్దని హెచ్చరించారు.అటవీశాఖ కార్యాలయాన్ని బాధిత రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం పేద రైతుల భూములు టార్గెట్ చేసుకొని వ్యాపారం చేస్తున్నదని అన్నారు.22ఏ పేరుతో లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు.పేదల భూములను అటవీ శాఖ అధికారులు బలవంతంగా కబ్జాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం,ఎమ్మెల్యే రైతుల సమస్యలు పట్టించుకోవాలని,లేకుంటే పేదల ఉసురు తగులుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పులగం తిరుపతి,కేశవ్ రెడ్డి,ముదిమడుగుల లావణ్య,శనిగారపు శ్రావణ్,కల్లెపల్లి నవీన్,నర్సింగ్,శ్రీనివాస్,రాజ కుమార్,ప్రశాంత్,అవినాష్,ముల్కల సత్యనారాయణ,జుమిడీ వెంకటేష్,ముదిమడుగుల శంకర్,పోషం,గోగర్ల లక్ష్మి రైతులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక




## గాంధీ జయంతి నాడు శ్రీచైతన్య స్కూల్ స్పెషల్ క్లాసులు:

– బిఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

– గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారిక సెలవు






**లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా బ్యూరో :** వికారాబాద్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంపై టీఆర్ఎస్‌వీ (బిఆర్ఎస్‌వీ) జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవు రోజున విద్యార్థులను పాఠశాలకు పిలిపించి స్పెషల్ క్లాసుల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని ఆయన ప్రశ్నించారు. సెలవు దినాన పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో టీఆర్ఎస్‌వీ నాయకులు పాఠశాలను సందర్శించి యాజమాన్యాన్ని వివరణ కోరారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి తరగతులు నిర్వహించిన శ్రీచైతన్య పాఠశాలపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాలలో అక్రమంగా యూనిఫాం విక్రయాలు: చర్యలకు డిమాండ్ పాఠశాల ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ యూనిఫామ్‌లను విక్రయిస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందని దీపక్‌రెడ్డి తెలిపారు. యూనిఫాం పేరిట తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం మోపకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ఈ విక్రయాల వ్యవహారంపై కూడా విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరవు సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ, నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాంల విక్రయాలపై ఇప్పటికే డీఈఓ,ఎంఈఓ లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమని ఆయన ఆరోపించారు. కళ్లముందే నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో స్పష్టం చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి విద్యార్థుల హక్కులను, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ఈ సమగ్ర వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి విచారణకు ఆదేశించాలని, అలాగే ఫిర్యాదులపై స్పందించని అధికారుల వైఖరిపైనా సమీక్ష జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్‌వీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రేస్ ప్రభుత్వానికి సంక్షేమం అంటే పట్టదు.

కేసీఆర్ ను మించిన పాలనలేదు.

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.




**వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి అక్టోబర్ 3:** కాంగ్రెస్ ప్రభుత్వానికి సంక్షేమం అంటే పట్టదని, గత కేసీఆర్ ను మించిన పాలన,పాలకుడు లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన విడుదల చేసిన ప్రకటన ఇలా. సంక్షేమానికి కొత్త నిర్వచనం కేసీఆర్ పాలన అని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టకున్నా ఆయా సందర్భాలు, ప్రజల అవసరాలను బట్టి కేసీఆర్ సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి పథకాలను అమలు చేయడంలో కేసీఆర్ మేటి అని ఆయన వెల్లడించారు.కేసీఆర్ పాలన, పథకాలు దేశానికి తలమానికంగా, రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ప్రకటించారు. మానవీయ పథకాల అమలుతో పేదలకు అండగా నిలిచిన పాలకుడు కేసీఆర్ అని ఆయన విడుదల చేసిన ప్రకటనలో కొనియాడారు. రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, దళితబంధు వంటి పథకాలు పార్టీలకు అతీతంగా అమలుచేసిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి సంక్షేమం అంటే పట్టదు. దాని నిర్వచనం ఏమిటో తెలియదని ఆయన విమర్శించారు. కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అన్న కాంగ్రెస్ అధికారం చేతికి అందాక ఉన్న కళ్యాణలక్ష్మిని ప్రశ్నార్థకం చేసిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కిట్, రైతుబీమా, న్యూట్రిషన్ కిట్ మాయం అయ్యాయని తెలిపారు. కళ్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఒక ప్రకటనలో కేసీఆర్ పాలనలో మొదలుపెట్టిన సంక్షేమ పథకాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్లాగించారు.

## ఆత్మూరులో 'ఇందిరమ్మ ఇళ్లు' రచ్చ రచ్చ

సర్పంచ్, గ్రామ కమిటీ తీర్మానించిన అర్హుల జాబితా గల్లంతు

మండల స్థాయిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడి చక్రం.. మా వాళ్లకే ఇవ్వాలంటూ పట్టు

సర్పంచ్ వర్సెస్ కాంగ్రెస్ నేతలు.. అర్హులైన పేదల్లో ఆందోళన

**మధిర, అత్మూరు, అక్టోబర్,3: లోకల్ గైడ్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం క్షేత్రస్థాయిలో రాజకీయ వివాదాలకు కేంద్రబిందువుగా మారుతోంది. మధిర మండలం ఆత్మూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తీవ్ర వివాదాస్పదమైంది. అర్హులకు ఇళ్లు కేటాయించాలన్న లక్ష్యం పక్కదారి పట్టి, గ్రామ సర్పంచ్ వర్గానికి, కాంగ్రెస్ గ్రామ శాఖ నాయకత్వానికి మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు గ్రామంలో రాజకీయ వేడిని రాజేసింది.గ్రామంలోని నిరుపేదలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ నేతృత్వంలో గ్రామ కమిటీ సమావేశమై లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసింది. నియమనిబంధనల ప్రకారం అర్హులను గుర్తించి, గ్రామ కమిటీ తీర్మానం ద్వారా ఒక జాబితాను ఫైనల్ చేసి అధికారులకు నివేదించేందుకు సిద్ధం చేశారు.గ్రామ కమిటీ ఆమోదించిన జాబితాను పూర్తిగా పక్కనబెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇందులో జోక్యం చేసుకుని, సర్పంచ్ రూపొందించిన జాబితాలో గత బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారి పేర్లే ఎక్కువగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. గ్రామ కమిటీ జాబితాను కాదని, తాము ప్రతిపాదించిన వ్యక్తులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలంటూ మండల స్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తూ చక్రం తిప్పుతున్నట్లు సమాచారం.అధికార పార్టీ నేత తీరుపై సర్పంచ్, గ్రామ కమిటీ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయం చూడకుండా గ్రామంలో నిజమైన నిరుపేదలను గుర్తించి లిస్టు తయారు చేస్తే, పార్టీల రంగు పులిమి అర్హులకు అన్యాయం చేయడం తగదని సర్పంచ్ వర్గం వాదిస్తోంది.ఎవరికి ఇళ్లు వస్తాయో తెలియక అసలైన పేదలు, గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, రాజకీయ ప్రమేయం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆత్మూరు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అక్టోబర్ 6న ఉస్మానియా కళాశాల వద్ద ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

పి. ఆనంద్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు



**లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా బ్యూరో :** ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాల ప్రాంగణంలో జరగబోయే మాదిగ విద్యార్థి సమాఖ్య ( ఎమ్మెస్ ఎఫ్ ) జాతీయ మహాసభలను విద్యార్థులందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ( ఎం ఎస్ పి ) జిల్లా మాజీ అధ్యక్షుడు పి. ఆనంద్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక గ్రంథాలయ ప్రాంగణంలో మాదిగ మహిళలు, విద్యార్థులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాదిగ మాట్లాడుతూ... వివిధ గ్రామాలు, మండలాలు, కళాశాలలు మరియు సంక్షేమ వసతిగృహాలలోని ఎంఎస్ఎఫ్ కమిటీల ప్రతినిధులు, మాదిగ విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నపూర్ణ మాదిగ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కేశపల్లి సునీత, రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, దారూర్ మండల అధ్యక్షుడు పి.నందు మాదిగ, పద్మమ్మ, లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

అనుమతి లేకుండా నిర్వహించే ఆసుపత్రులు,

దయాగ్నస్టిక్ కేంద్రాలపై చర్యలు




**వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, అక్టోబర్03(లోకల్ గైడ్ న్యూస్):** వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం రోజున జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్‌కు సంబంధించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ అమలు, రిజిస్ట్రేషన్లు ,పర్యవేక్షణకు సంబంధించిన నివేదికను కమిటీ సభ్యులకు సమర్పించారు.జిల్లాలోని వివిధ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ కొత్త రిజిస్ట్రేషన్ మరియు రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం సమర్పించిన దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. నిబంధనలను పూర్తిగా పాటిస్తున్న క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌ను గుర్తించి, వాటికి రిజిస్ట్రేషన్/రెన్యువల్ అనుమతులు మంజూరు చేశారు. ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనల్లో లోపాలు ఉన్న సంస్థలకు, లోపాలను సరిచేసుకోవడానికి అవసరమైన అవకాశం కల్పించాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ తప్పనిసరిగా తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, దయాగ్నస్టిక్ సెంటర్లపై నోటీసులు జారీ చేయడంతో పాటు చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆసుపత్రులు, క్లినికల్‌ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో అందిస్తున్న వైద్య సేవల వివరాలు, వైద్యుల వివరాలు, సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు , ఇతర అవసరమైన సమాచారాన్ని రోగులకు స్పష్టంగా కనిపించే విధంగా రిసెప్షన్ కౌంటర్ , ప్రాంగణంలోని ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు.అదేవిధంగా, ప్రభుత్వం/చట్టం ద్వారా నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే వైద్య సేవల ఫీజులు, ల్యాబొరేటరీ ఫీజులు, ఇతర దయాగ్నస్టిక్ సేవల ఫీజులు వసూలు చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్స్, దయాగ్నస్టిక్ సెంటర్లు ,ఇతర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రికార్డుల నిర్వహణ తదితర సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వై వి.గణేష్ ,డి సి పి.కవిత , జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, ఐ ఎం ఏ నుండి డాక్టర్ వెంకటస్వామి , డిప్యూటీ డి యం హెచ్ ఓ రాజమౌళి , జిల్లా మరియు జి డబ్ల్యు ఎం సి.ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాలకు 12 ఏళ్లు..

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కేసీఆర్ పథకాలు ప్రజల గుండెల్లో.. కాంగ్రెస్ హామీలు

కాగితాలపైనేనా

హామీలే తప్ప అమలు లేదు

హామీలతో గద్దెనెక్కి పథకాలను మరిచారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై చింతా ప్రభాకర్ తీవ్రస్థాయిలో ఫైర్

ఇది పాలన కాదు.. విధ్వంసానికి తొలి మెట్టు

రేవంత్ సర్కార్‌పై చింతా ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు




**లోకల్ గైడ్/ సంగారెడ్డి :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.కేసీఆర్ సుపరిపాలనను చూసి ప్రజలు ఆకర్షితులయ్యారని, అయితే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని చింతా ప్రభాకర్ విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు.ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరుగుతోందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా గత 12 ఏళ్లలో లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిందని, ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చింతా ప్రభాకర్ అన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల ద్వారా 12 ఏళ్లలో 16.78 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డాక్టర్ శ్రీహరి, ఎస్‌కే రషీద్, మల్ల గౌడ్, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, వేణుగోపాలస్వామి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్తపల్లి నాని, జలంధర్, పొన్న దశరథ్‌రెడ్డి, నాయికోటి నవీన్, శ్రీకాంత్, జాఫర్, నాయకులు శ్రావణ్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, రుక్మోద్దీన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నంబర్ 361 భూమిలో ఎలాంటి అక్రమాలు జరగలేదు

కోర్టు ఆదేశాల మేరకే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్

అధికారులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదు

ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి స్పష్టీకరణ




**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3( లోకల్ గైడ్ ) :** యాచారం మండలం నంది వనపర్తి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 361లో గల 5 ఎకరాల 39 గుంటల (5.11 ం 28 గుంటలు) భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగలేదని ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నకిలీ పత్రాల ఆధారంగా తహసీల్దార్, అధికారులు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై సమగ్ర విచారణ చేపట్టిన అనంతరం వాస్తవాలను వెల్లడించారు.

కోర్టు ఆదేశాలతోనే రిజిస్ట్రేషన్

ఆర్డీవో తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 361లోని భూమి మహ్మద్ బషీర్, మహ్మద్ నజీర్‌ల పేరిట ఉండేది. వీరు 2021 ఆగస్టు 5న మహ్మద్ హైమద్‌తో అమ్మకపు ఒప్పందం (అగ్రిమెంట్) కుదుర్చుకుని, కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా స్వీకరించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఒప్పందం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మహ్మద్ హైమద్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఓఎస్ నంబర్ 547/2021 కింద దావా వేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సంబంధిత పక్షాలకు నిర్ణీత గడువు ఇచ్చి, వారి నుంచి స్పందన లేకపోవడంతో హైమద్‌కు భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

నిబంధనల మేరకే ప్రక్రియ పూర్తి

కోర్టు ఉత్తర్వుల మేరకు 2025లో దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారని, అందుబాటులో ఉన్న పాత ఒప్పంద పత్రాలు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఆదేశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామని ఆర్డీవో తెలిపారు. న్యాయస్థాన ఆదేశాలను అమలు చేసే బాధ్యతను మాత్రమే రెవెన్యూ అధికారులు నిర్వర్తించారని, ఇందులో తహసీల్దార్ గానీ, ఇతర సిబ్బంది గానీ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని చెప్పారు. ఆధారాలు లేని తప్పుడు ఆరోపణలను నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు.ం

## హస్తాల వీరభద్ర స్వామి ఆలయ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

అక్రమ నిర్మాణాలను తొలగించాలని పోలీస్ కమిషనర్‌కు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి





**రాజేంద్రనగర్, అక్టోబర్ 3 (లోకల్ గైడ్):** రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప్పరిపల్లి గ్రామ పరిధిలోని శనివారం చింతల్‌మెట్‌లో ఉన్న హస్తాల వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా పుష్కరిణి మధ్యలో గోడ నిర్మించారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, కాంటెస్ట్ ఎమ్మెల్యే శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.ఈ విషయాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్‌తో కలిసి స్థానిక నాయకులు, కార్యకర్తలతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయానికి చెందిన భూముల్లో నిర్మాణాలు చేపట్టడం, పుష్కరిణి మధ్యలో గోడ నిర్మించడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఆలయ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆక్రమణకు గురైన భూములను తిరిగి ఆలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాలకు సంబంధించిన భూములు, పుష్కరిణులు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ కోసం అధికారులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఆలయాన్ని పరిరక్షించేందుకు ఎంత దూరమైనా వెళ్తామని, స్థానికులు, యువకులు, భక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఆలయంలో పూజా కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించి, ఆలయ భూముల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఆలయ భూములను కాపాడేందుకు యువత, భక్తులు, స్థానిక ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా నాయకులు వై. సీధర్, కొమురయ్య, బొక్క బాల్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, దీపక్ యాదవ్, కిట్టు గౌడ్, వంశీ యాదవ్, సులిగి వెంకటేష్, అమర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సందీప్ గౌడ్, రమణ రాజు గౌడ్, నర్సింగ్, మహేందర్ గౌడ్, సిద్దేశ్వర, శ్రీకాంత్ రెడ్డి, ఉదయ్ కుమార్, సందీప్ ముదిరాజ్, బాబురావు, విటల్, శ్రీను, రాజు, ఉమేందర్ రెడ్డి, రమేష్ రెడ్డితో పాటు బజరంగ్ దళ్ నాయకులు, స్థానిక యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టభద్రులు. ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం..

ప్రతి గ్రాడ్యుయేట్ బాధ్యతగా ఓటును నమోదు చేసుకోవాలి..

జఫర్ గడ్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డెస్క్ ప్రారంభం..




**వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, అక్టోబర్03(లోకల్ గైడ్ న్యూస్) :** జాఫర్ గడ్: వరంగల్- ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ ఓటరు నమోదు నోటిఫికేషన్ విడుదల చేసింది. దానికి సంబంధించిన నమోదు ప్రక్రియను ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ముమ్మరం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన నేపథ్యంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మాజీ ఉపముఖ్యమంత్రి డా. తాటికొండ రాజయ్య సూచనల మేరకు జాఫర్ గడ్ మండల కేంద్రంలోని బాలాజీ ఇంటర్నెట్ సెంటర్ వద్ద ఓటర్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు పల్లెపాటి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల పట్టభద్రుల ఓటరు నమోదును చేపట్టడం జరిగిందని, అన్ని గ్రామాలకు గ్రాడ్యుయేట్లను ఇంచార్జీలుగా ఎంపిక చేసి నమోదు చేస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కేసిఆర్ ప్రభుత్వానికి ఈ ఎన్నిక సంకేతం కాబోతుందని అన్నారు. మంటతో ఉన్న యువతరం తమ తడాఖాను చూపించే సమయం ఆసన్నమైందని జైపాల్ రెడ్డి అన్నారు.బీఆర్ఎస్వి కాకతీయ యూనివర్సిటీ నాయకులు పిన్నింటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. నయవంచక పాలనతో నిరుద్యోగులను, విద్యార్థులను గోస పెడుతున్న రేవంత్ సర్కారుకు కర్రు కాల్చి వాత పెట్టే అవకాశం మళ్లీ పట్టభద్రుల ఓటు రూపంలో మన వద్దకు వస్తుంది ఈ అవకాశంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అందుకోసం బాధ్యతగా పట్టభద్రులం అందరం ఓటును నమోదు చేసుకోవాలని విజయ్ కోరారు..అనంతరం మండల కమిటీ ఆధ్వర్యంలో సీఈఓ తెలంగాణ వెబ్సైట్ ద్వారా ఓటర్ నమోదు ప్రక్రియను జైపాల్ రెడ్డి ప్రారంభించారు..మండల కమిటీ కలిసికట్టుగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో ఫార్మ్ 18 ద్వారా దరఖాస్తులను అందుబాటులో ఉన్న అధికారికి అందజేశారు.ఈ సందర్భంగా అన్ని గ్రామాల పట్టభద్రులకు తమ ఓటు నమోదుకు అప్పీల్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు కడారి శంకర్, నజీర్,పెంతల రాజ్‌కుమార్, యార సోమిరెడ్డి,కలకోట రాజనీకాంత్, జాఫర్గడ్ ఉప సర్పంచ్ కొత్వాల కుమార్, స్థానిక గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీధర్, తిడుగు గ్రామ శాఖ అధ్యక్షులు రవి, సాగరం గ్రామ శాఖ ఇంచార్జి బోరగాని రాజేశ్వర్ రావు, తిడుగు ఉప సర్పంచ్ మనోహర్, యువజన నాయకులు నల్లతీగల శ్రీకాంత్, ప్రసన్న, పవన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.local-guidenews.com,contact:8977761499\\\